మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

Published from Jagitial
Circulated to Telangana

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 10-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 281 Issue: 281

10 ఏప్రిల్ 2026 - శుక్రవారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర మాసం - కృష్ణపక్షం, సూర్యోదయం - ఉ. 6:07, సూర్యాస్తమయం - సా. 6:27, తిథి, అష్టమి రా. 11:13 వరకు, తరువాత నవమి, సంస్కృత వారం, భృగు వాసరః, నక్షత్రం, పూర్వాషాఢ ఉ. 11:18 వరకు, తరువాత ఉత్తరాషాఢ, యోగం, శివ సా. 6:20 వరకు, కరణం, భాలవ ఉ. 10:19 వరకు, కౌలవ రా. 11:13 వరకు, వర్జ్యం, రా. 8:11 నుండి రా. 9:56 వరకు, దుర్ముహూర్తం, ఉ. 8:35 నుండి ఉ. 9:24 వరకు, మ. 12:42 నుండి మ. 1:31 వరకు, రాహుకాలం, ఉ. 10:45 నుండి మ. 12:17 వరకు, యమగండం, మ. 3:22 నుండి సా. 4:55 వరకు, గుళికకాలం, ఉ. 7:40 నుండి ఉ. 9:12 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:31 నుండి తె. 5:19 వరకు, అమృత ఘడియలు, ఉ. 6:07 నుండి ఉ. 7:54 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:52 నుండి మ. 12:42 వరకు, గమనిక: "o" అనగా మరుసటి రోజున

www.evarthalu.com


# డుగ్గు డుగ్గు.. ఎలక్ట్రిక్!

- మార్కెట్‌లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈవీ
- ఫుల్ చార్జింగ్‌తో 154 కిలోమీటర్ల రేంజ్
- 65 నిమిషాల్లోనే 80 శాతం బ్యాటరీ చార్జ్
- ఇంకా మరెన్నో ఫీచర్లతో అందుబాటులోకి





› 2

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎట్టకేలకు ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) మార్కెట్లోకి అధికారికంగా ప్రవేశించింది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న తన మొదటి ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను గురువారం భారత మార్కెట్లో ఆవిష్కరించింది. 'ఫ్లయింగ్ ఫ్లీ సీ6' పేరుతో విడుదలైన ఈ బైక్‌ను, కంపెనీ తన కొత్త సబ్-బ్రాండ్ 'సిటీ ప్లస్ ఎలక్ట్రిక్ మొబిలిటీ' కింద పరిచయం చేసింది.

## నేడు ఢిల్లీకి రేవంత్

### వెంట ఉత్తమ్, దామోదర, మహేశ్ సీడబ్ల్యూసీ భేటీకి హాజరు



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో నిర్వహించనున్న సీడబ్ల్యూసీ సమావేశానికి ఆయన హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు. మధ్యాహ్నం ఢిల్లీలో జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రితో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీనియర్ మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఈ పర్యటనలో సీఎం వెంట వెళ్లే అవకాశం ఉంది. రాష్ట్రంలో పాలన పరంగా 28 నెలలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో, ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలు, రాష్ట్ర అభివృద్ధి పనుల పురోగతిని సీఎం అధిష్ఠానానికి వివరించనున్నారు. అలాగే, కేబినెట్ విస్తరణ లేదా నామినేటెడ్ పోస్టుల భర్తీపైనా అధిష్ఠానంతో చర్చించే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. సాయంత్రం ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో ముఖ్యమంత్రి విడివిడిగా భేటీ కానున్నట్లు సమాచారం.



# మోదీ.. కేసీఆర్!

### కేంద్రంలో బీజేపీ పాలనే బాగుంది.. రాష్ట్రంలో కేసీఆర్‌తోనే సుపరిపాలన

### ప్రజాభీష్టం మేరకే బీఆర్ఎస్‌లోకి.. మాజీమంత్రి జీవన్ రెడ్డి స్పష్టీకరణ

జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని, రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడు అని కాంగ్రెస్ మాజీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆయన గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

జగిత్యాల, ఏప్రిల్ 9 (ఈవార్తలు): కేటీఆర్ స్వయంగా జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ తన ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్‌లో చేరుతున్నానని వెల్లడించారు. తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు కేసీఆర్, కేటీఆర్‌కు హృదయపూర్వక - తరువాయి 2 వ పేజీలో...

## ఢిల్లీ రంగంలోకి దిగాల్సింది

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడటంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పందించారు. జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ నాయకుడు పార్టీని వీడటం బాధాకరమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబానికి విధేయుడిగా ఉన్నారని తెలిపారు. జీవన్ రెడ్డి

- తరువాయి 2 వ పేజీలో...

## రేవంత్‌పై విమర్శలు సరికాదు

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీకి కొన్నిరోజుల క్రితం రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిపై ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. ముఖ్యమంత్రిపై విమర్శలు జీవన్ రెడ్డికి సరికాదని అన్నారు. ఎమ్మెల్యేలందరూ కలిసి ఆయనను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఇప్పుడు చేపడుతున్న పద్ధతికి తాము వ్యతిరేకమని మహేశ్‌గౌడ్ అన్నారు. జనాభా ఆధారంగా పునర్విభజన చేస్తే దక్షిణ భారతదేశం నష్టపోతుందని అన్నారు. దక్షిణ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఈ రెండు పార్టీలు కలిసిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. మంత్రి పొంగులేటిపై చేస్తున్న విమర్శలకు ఆధారాలు ఉంటే హరీశ్ రావు చూపించాలని డిమాండ్ చేశారు. తాము చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.


## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,148 |
| వెండి (గ్రాము): | రూ.260 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,006 |


## విశ్వవాణి



క్యాన్సర్ కణితులను తినే బ్యాక్టీరియాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆ బ్యాక్టీరియా కణితి లోపలికి చొచ్చుకుపోయి, లోపలి నుంచే క్యాన్సర్‌ను తినేస్తాయట. అయితే, ఆరోగ్యకరమైన కణాలను అవి ఏం చేయకుండా జెనెటిక్ ప్రోగ్రామింగ్ చేశామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# ఆరెంజ్ ఎండ

- నిప్పుల కొలిమిలా తెలంగాణ
- 3 డిగ్రీలు పెరగనున్న ఉష్ణోగ్రతలు
- పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ



రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 దాటిందంటే చాలు భానుడి భగభగలు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇక ఉదయం 10 తర్వాత రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. హైదరాబాద్ నగరంతో పాటు చాలా పట్టణాల్లో ఇదే పరిస్థితి.

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): ఇక తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల కింద సేదతీరుతున్నారు. కాగా, రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 3 డిగ్రీలు పెరుగుతాయని తాజాగా హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వచ్చే మూడ్రోజులు ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని చెప్పింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని - తరువాయి 2 వ పేజీలో...



# పోటెత్తిన ఓటరు

### 3 రాష్ట్రాల్లో భారీగా పోలింగ్

› 2

- కేరళంలో 75 శాతం
- అస్సాంలో 84 శాతం
- పుదుచ్చేరిలో 86 శాతం


కేరళం, అస్సాం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళం, పుదుచ్చేరిలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది.



# రోజుకు 15 నౌకలే

### హర్మూజ్‌పై ఇరాన్ ఆదేశాలు

టెహ్రాన్: అమెరికాతో ఇరాన్ చర్చలకు అంగీకరించిన నేపథ్యంలో హర్మూజ్ జలసంధిపై ఇప్పటివరకూ కొనసాగిన హీట్ కాస్త చల్లారింది. హర్మూజ్ జలసంధిని తెరవడానికి తాత్కాలికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఇరాన్.. తాజాగా మరో సంచలన ప్రకటన చేసింది. హర్మూజ్ జలసంధిని దాటే నౌకలు తమను తప్పకుండా సంప్రదించాలని స్పష్టం చేసింది. హర్మూజ్‌లో వాటర్ మైన్స్ ముప్పు పొంచి ఉందని, ఎలా పడితే అలా నౌకలు ఆ జలసంధిని దాటే ప్రయత్నం చేయద్దొన - తరువాయి 2 వ పేజీలో...



## పది వేలు దాటితే 'గంట' కొడతారు!

న్యూఢిల్లీ: డిజిటల్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకోనుంది. ముఖ్యంగా యూపీఐ లావాదేవీలకు సంబంధించి అకౌంట్ నుంచి అకౌంట్‌కు బదిలీ చేసే అధిక మొత్తం లావాదేవీలను గంటసేపు నిలిపివేసేందుకు ఆర్బీఐ ప్రతిపాదించింది. 'డిజిటల్ చెల్లింపుల్లో భద్రతా చర్యల అన్వేషణ' చర్చా పత్రంలో ఈ మేరకు - తరువాయి 2 వ పేజీలో...

# లెబనాన్‌లో 250 మంది మృతి

### హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు

### 1,100 మందికి తీవ్ర గాయాలు

పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటల్లోనే కొత్త ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇజ్రాయెల్ లెబనాన్‌పై భారీ వైమానిక దాడులకు దిగడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.



టెహ్రాన్: ఈ దాడుల్లో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 1100 మందికిపైగా గాయపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఇజ్రాయెల్ లెబనాన్‌లోని బీరుట్, బెకా లోయ ప్రాంతాల్లో హిజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. అమెరికాతో కుదిరిన ఒప్పందం తమకు, హిజ్బుల్లాకు మధ్య ఉన్న యుద్ధానికి వర్తించదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్

- తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

10-4-2026

మేషం: బంధు మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు కలిసిరావు. చేపట్టిన పనులు వాయిదా పడతాయి. మిత్రులతో ఆలయ సందర్శనం చేసుకుంటారు. ఉద్యోగంలో ఒడిదుడుకులు అధికమవుతాయి. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఆర్ధిక వాతావరణం నిరాశ కలిగిస్తుంది.

వృషభం: భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్ధిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. రాజకీయ వర్గాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

మిధునం: నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు లభిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల అండదండలతో సమస్యలు పరిష్కరించుకుంటారు. గృహమునకు బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

కర్కాటకం: బంధు మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. సంతాన ఆరోగ్య విషయమై వైద్య సంప్రదింపులు చేస్తారు. వ్యాపారంలో సొంత నిర్ణయాలు చేయడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో మరింత ఓర్పుతో వ్యవహరించాలి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. నూతన ఋణ యత్నాలు అంతగా కలిసిరావు.

సింహం: ఆర్ధిక విషయాలలో జాగ్రత్త అవసరం. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. సోదరులతో మాటపట్టింపులు ఉంటాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

కన్య: నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. ఋణగ్రస్తులు నుండి ధనం వసూలు అవుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆర్ధికంగా మరింత పురోగతి సాధిస్తారు. ఉద్యోగమున అధికారుల సహాయ సహకారాలతో కొన్ని సమస్యలు తొలగుతాయి.

తుల: నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలసిరావు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. బంధు మిత్రులతో అనుకోని విభేదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

వృశ్చికం: పేరు కలిగిన ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ఉద్యోగ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. బంధువుల నుండి గృహోపకరణాలు బహుమతులుగా పొందుతారు. ఆర్ధికంగా అనుకూలత కలుగుతుంది.

ధనస్సు: ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. వృత్తి వ్యాపారాలలో సమస్యలు మానసికంగా చికాకు కలిగిస్తాయి. ఉద్యోగమున ఆకస్మిక స్థానచలన సూచనలు ఉన్నవి.

మకరం: గృహమునకు చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగమున ఉన్నతాధికారులతో సఖ్యతగా వ్యవహరించి ప్రశంసలు అందుకుంటారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి.

కుంభం: వృత్తి వ్యాపారాలలో అనుకూలత పెరుగుతుంది. ఉద్యోగమున అధికారులతో సమస్యలు తొలగి ఊరట పొందుతారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. సన్నిహితులతో శుభకార్యాలకు హాజరవుతారు. ప్రయాణాలలో ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది.

మీనం: మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలలో కష్టానికి తగ్గ ఫలితం కనిపించదు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. దూరప్రయాణ సూచనలున్నవి. చేపట్టిన పనులలో శ్రమ మరింత అధికం అవుతుంది. వృత్తి ఉద్యోగాలు నిరాశ కలిగిస్తాయి. కొన్ని వ్యవహారాలలో మానసిక అనారోగ్య సమస్యలు కలుగుతాయి.

# డుగ్గు డుగ్గు.. ఎలక్ట్రిక్!



న్యూఢిల్లీ: నగరాల్లోని యువత, రోజువారీ రైడర్లను లక్ష్యంగా చేసుకుని ఈ బైక్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. ఈ కొత్త ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ ఎక్స్-షోరూమ్ ధరను రూ.2.79 లక్షలుగా రాయల్ ఎన్‌ఫీల్డ్ నిర్ణయించింది. అయితే, వినియోగదారులకు మరింత సౌలభ్యం కల్పించేందుకు 'బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్' విధానాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానాన్ని ఎంచుకుంటే, వినియోగదారులు కేవలం రూ.1.99 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. ఏప్రిల్ 10 నుంచి ఈ బైక్‌కు సంబంధించిన బుకింగ్‌లు ప్రారంభం కానుండగా, మే నెల నుంచి డెలివరీలను మొదలుపెట్టనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఫ్లయింగ్ ఫ్లీ సీ6 పర్ఫార్మెన్స్ పరంగా ఆకట్టుకునేలా ఉంది. ఈ బైక్‌లో 3.91 కిలోవాట్ అవర్ సామర్థ్యం గల బ్యాటరీ ప్యాక్‌ను అమర్చారు. దీనికి 15.4 కిలోవాట్ పీక్ పవర్‌ను ఉత్పత్తి చేసే పర్మనెంట్ మాగ్నెట్ సింక్రోనస్ మోటార్‌ను జత చేశారు. ఈ బైక్ గరిష్ఠంగా గంటకు 115 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. కేవలం 3.7 సెకన్లలోనే 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఒక్కసారి పూర్తి ఛార్జ్‌పై 154 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని ఇండియన్ డ్రైవింగ్ సైకిల్ స్టాండర్డ్స్ ప్రకారం కంపెనీ తెలిపింది. ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ద్వారా కేవలం 65 నిమిషాల్లో బ్యాటరీని 20% నుంచి 80% వరకు ఛార్జ్ చేసుకోవచ్చు.

నగర ప్రయాణాలకు అనువుగా ఈ బైక్‌ను కాంపాక్ట్, ఆధునిక డిజైన్‌లో తీర్చిదిద్దారు. ఫ్రేమ్ మొత్తం బయటికి కనిపించేలా చేసిన డిజైన్ దీనికి ప్రత్యేక ఆకర్షణ ఇస్తోంది. ఫ్లోటింగ్ సీటు, అవసరం లేనప్పుడు తీసివేయగల పిల్లియన్ సీటు వంటివి దీని డిజైన్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. అధునాతన ఫీచర్ల విషయంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏమాత్రం రాజీ పడలేదు. ఇందులో ఎల్ఈడీ హెడ్‌లైట్లు, గూగుల్ భాగస్వామ్యంతో పనిచేసే ఆన్‌బోర్డ్ నావిగేషన్ సిస్టమ్, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్ ప్యాడ్ వంటివి ఉన్నాయి. భద్రతకు పెద్దపీట వేస్తూ కార్నరింగ్ ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఫీచర్లను అందించారు. రైడర్ తన ఇష్టానుసారం స్పోర్ట్, ఇండివిడ్యువల్ వంటి రైడింగ్ మోడ్‌లను ఎంచుకోవచ్చు. ఫ్లయింగ్ ఫ్లీ సీ6 మోడల్‌లో ప్రధాన ప్రత్యేకత దాని బరువు. ఈ బైక్ బరువు కేవలం 124 కిలోలు మాత్రమే. ఇప్పటివరకు రాయల్ ఎన్‌ఫీల్డ్ విడుదల చేసిన మోటార్‌సైకిళ్లలో ఇదే అత్యంత తేలికైనది కావడం గమనార్హం. ఈ మోడల్ ద్వారా ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో తమదైన ముద్ర వేయాలని, భారత ఈవీ మార్కెట్లో బలమైన పోటీదారుగా నిలవాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.



# 'ఆరెంజ్' ఎండ

**మొదటి పేజీ తరువాయి**

ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండలో శరీరం నుంచి చెమట రూపంలో నీరు, లవణాలు బయటకు పోతాయని, కాబట్టి దాహం వేయకపోయినా తరచుగా నీరు తాగుతూ ఉండాలని చెబుతున్నారు. మంచినీటితో పాటు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ అందుతాయని అంటున్నారు. చక్కెర శాతం ఎక్కువగా ఉండే శీతల పానీయాలు, కెఫిన్ అధికంగా ఉండే కాఫీ, టీలకు దూరంగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుందని.. అత్యవసరమైతే తప్ప ఈ సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిదని అంటున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలని.. తలకు ఎండ తగలకుండా గొడుగు, టోపీ వంటివి ధరించాలి అంటున్నారు. కళ్లకు రక్షణగా సన్ గ్లాసెస్ వాడటం మంచిదని చెబుతున్నారు. వేసవిలో తేలికపాటి ఆహారం తీసుకోవాలని.. వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# రోజుకు 15 నౌకలే

**మొదటి పేజీ తరువాయి**

హెచ్చరించింది. నౌకల రాకపోకలపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ)తో సమన్వయం చేసుకున్న తర్వాతే ముందుకు సాగాలని తెలిపింది. అయితే, రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధిని దాటడానికి ఇరాన్ రోజుకు 15 నౌకల మాత్రమే అనుమతిస్తుంది. ఈ జలమార్గాన్ని దాటడానికి ఆ నౌకలకు ఇరాన్ అధికారుల నుండి ముందస్తు అనుమతి కూడా అవసరం. ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం, పది కంటే తక్కువ నౌకలు మాత్రమే హోర్ముజ్ జలసంధిని దాటడానికి అనుమతిస్తున్నాయి. సీజ్‌ఫైర్ ఒప్పందం ప్రకారం.. ' హోర్ముజ్ జలసంధి గుండా రోజుకు 15కు మించి నౌకలు మించి ప్రయాణించడానికి లేదు. ఈ రాకపోకలు ఇరాన్ ఆమోదం, ఒక నిర్దిష్ట నియమావళి అమలుపై మాత్రమే ఆధారపడి ఉంటాయి' అని ఒక సీనియర్ ఇరాన్ అధికారి చెప్పినట్లు రష్యన్ వార్తా సంస్థ టాస్ పేర్కొంది.

# పది వేలు దాటితే 'గంట' కొడతారు!

**మొదటి పేజీ తరువాయి**

ప్రతిపాదనలను సూచించింది. ఇందుకు రూ. 10,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన డిజిటల్ లావాదేవీలను ప్రాసెస్ చేయడానికి ఒక గంట ఆలస్య నిబంధనను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఈ సమయంలో, వినియోగదారులకు లావాదేవీని రద్దు చేసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ లావాదేవీ అనుమానాస్పదంగా అనిపిస్తే, దాన్ని కొనసాగించడానికి ముందు బ్యాంక్ కస్టమర్ నుంచి రీ-కన్ఫర్మేషన్ తీసుకోవలసి ఉంటుంది. మర్చంట్ పేమెంట్స్, ఓటీటీ లేదా ఇతర సబ్‌స్క్రిప్షన్, లోన్, ఇన్సూరెన్స్ వంటి లావాదేవీలు, చెక్కులకు మినహాయింపు ఉంటుంది.

# లెబనాన్‌లో 250 మంది మృతి

**మొదటి పేజీ తరువాయి**

నెతన్యాహు స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ట్రంప్ కూడా "లెబనాన్‌లో జరుగుతున్నది ప్రత్యేక ఘర్షణ"గా వ్యాఖ్యానించారు. దాడులను ఐక్యరాజ్య సమితి తీవ్రంగా ఖండించింది. ఒప్పందం కుదిరిన కొన్ని గంటల్లోనే ఇంత పెద్ద స్థాయిలో హింస చెలరేగడం ఆందోళన కలిగించిందని యూఎన్ మానవ హక్కుల విభాగం తెలిపింది.

**శాంతి చర్చలకు సిద్ధం: నెతన్యాహు**

లెబనాన్‌పై భీకర దాడులు కొనసాగించిన ఇజ్రాయేల్ శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించింది. కాల్పుల విరమణలో లెబనాన్ కూడా భాగమేనని, దాడులు తగవని ఇరాన్ సహా పలు దేశాలు ఆగ్రహించిన నేపథ్యంలో ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తాజాగా చర్చలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే.. దౌత్యపరమైన ఒప్పందానికి బీరుట్ పదే పదే విజ్ఞప్తి చేయడంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 'ఇజ్రాయెల్‌తో నేరుగా చర్చలు జరపాలని భావిస్తున్నట్లు లెబనాన్ ప్రభుత్వం పదే పదే విజ్ఞప్తి చేసింది. అందుకని వీలైనంత త్వరగా ఆ దేశంతో శాంతి చర్చలు జరపాలని బుధవారం మా క్యాబినెట్‌ను ఆదేశించాను. హెజ్బొల్లాకు ఎలాంటి హానీ తలపెట్టకుండా, లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య శాంతి చర్చలు జరిగేలా చూస్తా'నని నెతన్యాహూ ఒక ప్రకటనలో తెలిపారు.

# మోదీ.. కేసీఆర్!



**మొదటి పేజీ తరువాయి**

ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. ఎందరి ప్రభుత్వాల్లో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉందని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని చెప్పారు.

**నిబద్ధత గల నాయకుడు జీవన్ రెడ్డి: కేటీఆర్**

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి నిబద్ధత గల నాయకుడు కాబట్టే ఇంతకాలం కాంగ్రెస్‌లో కొనసాగారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 2014 ఎన్నికలకు ముందే జీవన్‌రెడ్డిని కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించేందుకు తమ సహోదరులందరితో కలిసి ఆయన వద్దకు వచ్చామన్నారు. '2014 ఎన్నికలకు ముందే కేసీఆర్ జీవన్ రెడ్డిని ఆహ్వానించారు. కానీ, నిబద్ధత గల నాయకుడిగా ఆయన కాంగ్రెస్‌తోనే కొనసాగారు. కేసీఆర్, జీవన్‌రెడ్డి బంధం ఈనాటిది కాదు. జూన్ 2, 2014లో ముఖ్యమంత్రిగా పదవి చేపట్టాక మొట్టమొదటి సారి జగిత్యాలకు వచ్చారు. ఆరోజు బోర్నపల్లి బ్రిడ్జి గురించి జీవన్ రెడ్డి.. కేసీఆర్ అడిగారు. ఆయనడిగిందే తడవుగా కరీంనగర్ జిల్లాలో మొట్టమొదటి సాంక్షన్ ఇచ్చారు. షుగర్ ఫ్యాక్టరీపై జీవన్ రెడ్డి ఫైట్ చేశారు. ఆ క్రమంలోనే కేసీఆర్ మహారాష్ట్ర తరహా కో ఆపరేటివ్ సొసైటీ పద్ధతిలో పెడదామన్నారు. పార్టీ బలోపేతానికి జీవన్ రెడ్డి చేరిక బాగుంటుందని జగిత్యాల నాయకత్వం కూడా మద్దతు తెలిపింది' అని తెలిపారు. కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ మండిపడ్డారు. ఇది కాలం నెట్టుకొచ్చే సర్కారు అంటూ ధ్వజమెత్తారు. ' మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు. రూ. 70 లక్షల కోట్లు రైతులకు బకాయి పడ్డారు. బాసరలో ముఖ్యమంత్రి భాష అసహ్యంగా ఉంది. నిఖార్సైన జీవన్‌రెడ్డి వంటి నేతలను అవమానపరుస్తోంది ఈ కాంగ్రెస్. నేను భట్టి ఇంటికి పెళ్లికి పోయినప్పుడు కూడా వంద మంది రాబోయేది మీ ప్రభుత్వమేనన్నారు. కేసీఆర్‌ను కూడా కలిసి జీవన్‌రెడ్డితన నిర్ణయం ప్రకటిస్తామన్నారు. జీవన్‌రెడ్డికి పార్టీలో సముచిత స్థానం ఉంటుంది' అని కేటీఆర్ పేర్కొన్నారు. జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. 'కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ మా ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారు. హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నా. కాంగ్రెస్ నుంచి రాజీనామా భావోద్వేగానికి గురి చేసింది. ఇప్పుడు బీఆర్ఎస్‌తో కలవడం సంతోషంగా ఉంది. గత 20 మాసాలుగా అవమానాలు తట్టుకుని ఓపిక పట్టా. ఎందరి ప్రభుత్వాల్లో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉంది. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం. కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు.

# పోటెత్తిన ఓటరు



న్యూఢిల్లీ: కేరళం, అస్సాం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళం, పుదుచ్చేరిలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు 75 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినా క్యూ లైన్‌లలో ఉన్నవారిని ఓటు వేసేందుకు అనుమతించారు.

# ఢిల్లీ రంగంలోకి దిగాల్సింది: జగ్గారెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

విషయంలో అంతర్గతంగా ఏం జరుగుతుందో ఏఐసీసీ స్థాయిలో చెక్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నేరుగా దిల్లీ నాయకత్వమేబాగుండేదని పేర్కొన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని.. ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీలు మారడం ప్రస్తుత రాజకీయాల్లో సహజమన్నారు. జీవన్ రెడ్డి పార్టీ మారేందుకుగల కారణాలను బహిరంగంగా మీడియాతో చెప్పలేమని, అంతర్గతంగా పార్టీలో చర్చిస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# ఏపీ, టీజీ ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని నియమితులయ్యారు. ప్రస్తుతం మోరంపూడి అనిల్ కుమార్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఉన్నారు. ఆయన స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు చేపడుతారు. వీరిద్దరూ తెలుగువారే. సురేశ్ బత్తినిని నియమిస్తూ కేంద్రప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. సురేశ్ బత్తిని గతంలో హైదరాబాద్ రీజియన్‌లో చీఫ్ కమిషనర్‌గా పని చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని పన్నుల పరిపాలన, ఆదాయ వసూళ్ల లక్ష్యాలు, శాఖాపరమైన అంశాలపై ఆయనకు పూర్తిస్థాయి అవగాహన ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపన్ను శాఖకు సంబంధించి అత్యున్నత పదవి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పదవి. పన్ను వసూళ్ల లక్ష్యాలను పర్యవేక్షించడంతో పాటు చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడం, శాఖాపరమైన పరిపాలనను సమన్వయం చేయడం వంటివి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ప్రధాన బాధ్యతలు.

# జగన్ 'మావిగన్ జోకర్': షర్మిల

విజయవాడ, ఏప్రిల్ 9 (ఈవార్తలు): వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మూడు రాజధానుల పేరుతో రుషికొండను మింగేసి, సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్న జగన్.. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా మిగిలిపోయారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ కేవలం వైఎస్సార్ పేరును ఉపయోగించుకున్నారో తప్ప, ఆయన ఆశయాలకు వారసుడు కాలేకపోయారని విమర్శించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన 'ప్రజా ప్రస్థానం' పాదయాత్రకు 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా షర్మిల ఈ వ్యాఖ్యలు చేశారు. 2003 ఏప్రిల్ 9న చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు వైఎస్సార్ సాగించిన 1457 కిలోమీటర్ల పాదయాత్ర, కాంగ్రెస్‌ను రాష్ట్రంలో, దేశంలో అధికారంలోకి తెచ్చిన ఒక శాశ్వత జ్ఞాపకమని ఆమె గుర్తుచేశారు. ఆనాటి పాదయాత్ర నేటి అభివృద్ధికి నిర్వచనంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా జగన్ పాలనపై షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. "వైఎస్సార్ ఐడియాలజీ నిజంగా వైసీపీలో ఉంటే, జగన్ గారు సీఎం అయ్యి కూడా జలయజ్ఞాన్ని ఎందుకు పూర్తి చేయలేదు? 'మాట తప్పం మడమ తిప్పం' అనే వైఎస్సార్ నినాదాన్ని వాడుకుంటూ, సంపూర్ణ మద్యపాన నిషేధం అని హామీ ఇచ్చి, కల్తీ మద్యం అమ్ముతూ 'ఓన్లీ క్యాష్' మాఫియా ఎందుకు నడిపారు?" అని నిలదీశారు. వైఎస్సార్ జీవితకాలం వ్యతిరేకించిన బీజేపీకి జగన్ దత్తపుత్రుడిగా ఎలా మారారని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా క్రైస్తవ మైనారిటీలపై దాడులు జరుగుతున్నా వైఎస్సార్ వారసుడిగా జగన్ ఎందుకు ఖండించలేదని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ హయాంలోనే సంక్షేమానికి అసలైన అర్థం లభించిందని షర్మిల అన్నారు. ఉచిత కరెంటు, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్లు, పావలా వడ్డీ రుణాలు, 108/104 సేవలు వంటి ప్రతి పథకం ప్రజల కన్నీళ్ల నుంచి పుట్టిందేనని కొనియాడారు. వైఎస్సార్ ఐడియాలజీ బతికి ఉంది కేవలం కాంగ్రెస్ పార్టీలోనేనని, ఆయన ఆశయాలు మళ్లీ కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. వైఎస్సార్ అభిమానులందరూ హస్తంతో జతకట్టాలని, ఆనాటి సంక్షేమ పాలనను మళ్లీ తీసుకొద్దామని పిలుపునిచ్చారు. "వైఎస్సార్ అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే వైఎస్సార్" అని ఆమె పునరుద్ఘాటించారు.



## ఫలితాల్లో ఉద్దేశపూర్వక ఆలస్యం లేదు

**క్లారిటీ ఇచ్చిన తెలంగాణ విద్యాశాఖ**

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): ఇంటర్ ఫలితాలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యా శాఖ ఖండించింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. ఫలితాల ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని తెలిపింది. ఇంతకుముందు ఎప్పుడూ ఏప్రిల్ మొదటి వారంలో ఇంటర్ ఫలితాలు విడుదల కాలేదని ఈ సందర్భంగా గుర్తు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గత ఏడాది వరకు జరిగిన ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదలైన తేదీలను కూడా పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఫ్యాక్ట్ చెక్ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇంటర్ ఫలితాలు 2014లో మే 3న, 2015లో ఏప్రిల్ 22న, 2016లో ఏప్రిల్ 22న, 2017న ఏప్రిల్ 16న, 2018లో ఏప్రిల్ 13న, 2019లో ఏప్రిల్ 18న, 2021లో జూన్ 28న, 2022లో జూన్ 28న, 2023లో మే 4న, 2024లో ఏప్రిల్ 24న, 2025లో ఏప్రిల్ 22న విడుదలయ్యాయని పేర్కొంది. సమాధాన పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాల ఆధారంగా ఫలితాలను ప్రకటించే తేదీలు ప్రతి సంవత్సరం మారుతుంటాయనే విషయాన్ని గ్రహించాలని పేర్కొంది. మూల్యాంకనం పూర్తయ్యే సమయం ఆధారంగానే ఫలితాలను విడుదల చేస్తారని తెలిపింది. విద్యా శాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విద్యార్థులు, తల్లిదండ్రులు విశ్వసించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యే తప్పుడు వార్తలను నమ్మవద్దని కోరింది.

## పొంగులేటి అవినీతిని చెప్పిందే రేవంత్

**మాజీమంత్రి హరీశ్ రావు కౌంటర్ అటాక్**

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): తమ మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని తమ అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనుమతులు లేకుండానే నడుపుతున్నారని రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. పొంగులేటికి చెందిన ఈ కంపెనీలో అవినీతి జరిగిందని సీఎం చెప్పడం, అధికారులు నోటీసులు ఇవ్వడం తప్పా లేక తన కంపెనీపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు. నాలుగు శాఖలకు చెందిన అధికారులు ఈ కంపెనీకి మూడుసార్లు నోటీసులు ఇచ్చారని తెలిపారు. తన కంపెనీ విషయంలో ముఖ్యమంత్రి తప్పు చెప్పారని సభలోనే పొంగులేటి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఆయన పొంగులేటి కాదని, పొంగు'లూటీ' అని ఎద్దేవా చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారం గురించి మాట్లాడుతూ, రెండున్నరేళ్లుగా ఆ భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. అది ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తోందని నిలదీశారు.

# జాగృతి వల్లే మహిళా బిల్లు

**మహిళా కోటాపై కేంద్ర కేబినెట్ నిర్ణయం ఏకపక్షం.. మహిళా కోటాలో ఓబీసీలకు సబ్ కోటా కల్పించాలి**

**జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈ బిల్లు అమలులో 2011 జనాభా లెక్కలను ప్రతిపాదికగా తీసుకుంటామని చెప్పటం మహిళా లోకాన్ని మోసం చేయటమేనన్నారు. మహిళా కోటాకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో గురువారం ఆమె వీడియో సందేశం విడుదల చేశారు. ప్రస్తుతం చేపట్టే జనగణనలో ఓబీసీ గణన చేయాలని డిమాండ్ చేశారు. జనగణన లో కులం కాలమ్ ఉన్నా వాళ్లు ఓబీసీలకు చెందుతారు అనే క్లాసిఫికేషన్ లేదన్నారు. దీంతో బీసీల జనాభా ఎంత అనే లెక్క తేలదన్నారు. జనగణన లో ఓబీసీలను లెక్కించి ఆ తర్వాతే మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా కోటా విషయంలో బీజేపీ చేస్తున్న అన్యాయంపై పోరాటానికి బీసీ మహిళలంతా సిద్ధం కావాలని కవిత పిలుపునిచ్చారు.



**డ్రాఫ్ట్ బిల్లు ముందే ఇవ్వాలి**

మహిళ రిజర్వేషన్ల బిల్లు అమలు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్లమెంట్ సమావేశాలకు ముందే డ్రాఫ్ట్ బిల్లును అన్ని పార్టీలకు ఇవ్వాలని కవిత కోరారు. లేదంటే అభ్యంతరాలు చెప్పే అవకాశం ఉండదన్నారు. బిల్లుపై చర్చ జరిగే రోజు ఉదయమే సభ్యులకు బిల్లు పత్రులను ఇస్తామని చెప్పటమంటే కచ్చితంగా ఇది అన్యాయం చేసే కుట్రనని మండిపడ్డారు. డ్రాఫ్ట్ బిల్లును ముందే ఇచ్చే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దేశంలోని జాతీయ పార్టీల నేతలతో మాట్లాడతానని కవిత చెప్పారు. పార్లమెంట్ లో మహిళ బిల్లు విషయంలో బీజేపీ వైఖరిని నిరసిస్తూ మహిళలకు న్యాయం చేసే విధంగా అన్ని పార్టీలు ఒక్కటవ్వాలని కోరారు.

**మహిళ బిల్లు రావటంలో జాగృతిదే కీలక పాత్ర**

దేశంలో మహిళ రిజర్వేషన్ల బిల్లు రావటంలో జాగృతి ది కీలక పాత్ర ఉందని కవిత చెప్పారు. ఈ బిల్లు కోసం ఢిల్లీలో దీక్ష చేసిన సందర్భాన్ని ఆమె గుర్తు చేశారు. దేశంలోని 18 పార్టీలను ఏకం చేసి బిల్లు కోసం పోరాటం చేసే విధంగా కో ఆర్డినేట్ చేశామన్నారు. ఢిల్లీలో తాను చేసిన దీక్ష చేసిన సందర్భంగా పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలు ఢిల్లీకి వచ్చి పోరాటం చేశారని చెప్పారు. మహిళ బిల్లు కోసం జాగృతి వెలిగించిన దీపం ద్వారా దేశంలోని 29 రాష్ట్రాల మహిళలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పవన్ ఖేరా అరెస్ట్‌పై తీర్పు రిజర్వ్

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరాకు అరెస్ట్ నుంచి తాత్కాలిక ఊరట లభిస్తుందా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య రినికి భూయాన్ శర్మపై పరువు నష్టం కలిగించే ఆరోపణలు చేశారన్న కేసులో, తనను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని కోరుతూ పవన్ ఖేరా దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ కె. సుజన శుక్రవారం ఈ తీర్పును వెలువరించే అవకాశం ఉంది. అసోం పోలీసులు నమోదు చేసిన కేసు నేపథ్యంలో, అక్కడి కోర్టులను ఆశ్రయించేందుకు వీలుగా తనకు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ మంజూరు చేయాలని ఖేరా తన పిటిషన్‌లో కోరారు. ఖేరా తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, అసోం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆరోపించారు. అయితే, అసోం అడ్వకేట్ జనరల్ దేవాజిత్ సైకియా ఈ వాదనలను వ్యతిరేకించారు. ఢిల్లీ నివాసి అయిన ఖేరా, హైదరాబాద్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ ఎందుకు దాఖలు చేశారో సరైన కారణాలు చూపలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రినికి భూయాన్ శర్మకు పలు విదేశీ పాస్‌పోర్టులు, విదేశాల్లో ప్రకటించని ఆస్తులు ఉన్నాయని పవన్ ఖేరా ఇటీవల ఓ ప్రెస్‌మీట్‌లో సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై అసోం పోలీసులు ఆయనపై పరువునష్టం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 14 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలోని ఖేరా నివాసానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. మరోవైపు, హైదరాబాద్‌లోని ఆయన భార్య నీలిమ ఇంటి వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అజ్ఞాతం నుంచి పవన్ ఖేరా ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. ఆయనపై, ఆయన భార్యపై వచ్చిన ఆరోపణలకు సీఎం సమాధానం చెప్పాలే తప్ప, పోలీసులను అడ్డుపెట్టుకోవడం సరికాదని అన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడనని, రాహుల్ గాంధీ సైనికుడిగా ప్రశ్నలు అడుగుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యే పల్లాకు రూ.లక్ష బురిడీ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): 'వికసిత్ భారత్' పేరుతో సైబర్ మోసగాళ్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని మోసం చేశారు. ఎమ్మెల్యేకు ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్టుమెంట్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. కేంద్ర ప్రభుత్వ 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నమ్మబలికాడు. జనగామ నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్ధిదారుల జాబితాను పంపించాలని, దరఖాస్తుకు ఈరోజే గడువు ముగుస్తుందని నమ్మించాడు. ఒక్కో దరఖాస్తుకు రూ.2,500 ప్రాసెసింగ్ ఫీజు ఉంటుందని, నలభై మందికి రూ.1 లక్ష వెంటనే పంపిస్తే దరఖాస్తు చేస్తానని చెప్పాడు. నియోజకవర్గంలోని అర్హులకు రుణాలు వస్తే స్వయం ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతో నిందితుడు చెప్పిన నెంబర్‌కు ఎమ్మెల్యే డబ్బులు పంపించారు. లక్ష రూపాయలు పంపించిన తర్వాత అవతలి వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అనుమానం వచ్చి, ఎమ్మెల్యే ఆరా తీయగా, అది నకిలీ కాల్ అని తెలిసింది. దీంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## జీవన్ రెడ్డిది తప్పుడు నిర్ణయం: అర్వింద్

మెట్‌పల్లి, ఏప్రిల్ 9 (ఈవార్తలు): కాంగ్రెస్ కు రాజీనామా చేసిన సీనియర్ రాజకీయవేత్త జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతుండటంపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో బీఎస్పీ నేత నిశాంత్ కార్తికేయను బీజేపీలోకి ఆహ్వానించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత బీఆర్ఎస్‌లోకి వెళ్లాలనుకోవడం ఒక తప్పుడు నిర్ణయమని, ఆయన తొందరపడి ఈ నిర్ణయం తీసుకున్నారని అర్వింద్ అభిప్రాయపడ్డారు. వ్యక్తిగతంగా జీవన్ రెడ్డి అంటే తనకు ఎంతో గౌరవమని పేర్కొంటూనే, అస్తిత్వం కోల్పోతున్న బీఆర్ఎస్‌లో చేరడం వల్ల ప్రయోజనం ఉండదని హితవు పలికారు. స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌పై విమర్శలు చేస్తూ, ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి నష్టం కలిగిస్తారని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఆయన పార్టీలు మారుతుంటారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి విధివిధానాలు కరవయ్యాయని, ఆ పార్టీ మనుగడ కష్టమని అరవింద్ స్పష్టం చేశారు. ఒకవైపు జీవన్ రెడ్డి రాకతో బీఆర్ఎస్ ఉత్సాహంగా ఉన్నా, బీజేపీ మాత్రం ఇది ఒక వ్యర్థ ప్రయత్నమని కొట్టిపారేస్తోంది.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.


- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## భర్తపై కోపంతో భార్యను చెట్టుకు కట్టేసిన గ్రామస్థులు

సంగారెడ్డి, ఏప్రిల్ 9 (ఈవార్తలు): తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో ఒక అంగన్వాడీ ఉపాధ్యాయురాలిని చెట్టుకు కట్టేసిన ఘటనలో కంగ్టి పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. కంగ్టి మండలం రాసోల్‌లో ఈ ఘటన జరిగింది. అంగన్వాడీ ఉపాధ్యాయురాలి భర్త తమ నుంచి డబ్బులు తీసుకుని పారిపోయాడంటూ ఆమెను గ్రామస్థులు చెట్టుకు కట్టేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కంగ్టి మండలంలోని దామరగిద్ద గ్రామానికి చెందిన వసంతకుమారి రాసోల్ గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వసంతకుమారి భర్త ప్రభాకర్ ఇటీవల హెచ్‌బీఎం ఫైనాన్స్ పేరుతో గ్రామానికి చెందిన అవుటి సాయవ్వ, చాకలి బాలమణి, భూతాలే వైద్యనాథ్, అవుటి బంద్యప్ప, కోటగిరి రాములు వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసి పారిపోయాడు.

# చైతన్య దీపిక.. మొలాటు




(మొలాటు పుస్తక సమీక్ష)


నేటితరం అభ్యుదయ కవుల్లో కూకట్ల తిరుపతి ఒకరు. గత దశాబ్దకాలంగా అచ్చమైన తెలంగాణ జానపదుల భాషలో తను రాసిన చిక్కని కవితలను కుప్పగా పోసి "మొలాటు"గా మన ముందు ఆవిష్కరించారు. తెలంగాణ కవులలో కరీంనగర్ కవుల కవిత్వం చైతన్య దీప్తులను విరజిమ్మడంలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సాధారణంగా తెలంగాణ భాషలో ఉర్దూ పదాలు దొర్లడం సహజం. కానీ ఇందులో అన్యభాష పదాలు చొరబడకుండా అచ్చ తెలుగుభాషలో రాయడం ఈ పొత్తం సాధించిన మరో ప్రత్యేకత. మొలాటు పుస్తకం విషయ ప్రధానమైన వస్తు నిష్ఠను కలిగివుంది. ముందుగా ఈ కవిని గురించిన కొన్ని విషయాలు మనకు తెలియాలి. "నాకు శ్రీశ్రీనే ప్రేరణ" అని కవి చెప్పుకున్నాడు.

తన కవిత్వం, జీవితం వేర్వేరు కాదు. రెండూ ఒకటే అని, కల్పితాలకు తావు లేదని చెప్పాడు. తన వంశంలో తొలితరం విద్యావంతున్నని చెప్పుకొచ్చారు. కూకట్ల తిరుపతి తన వ్యదార్థ భరిత యదార్థ జీవిత అనుభవాలు, అనుభూతుల నుంచే తన కవిత్వం అల్లుకుందని అన్నాడు. అంటే ఆయన అక్షరాల అల్లిక పల్లె గాలి అంత స్వచ్ఛమైనది. ఏటి నీటి అంత సహజమైనదని భావించవచ్చు. "కవిత్వమంటే.../నింగికి నిచ్చెనేయడం/పాతాళానికి పల్టీ కొట్టడమే కాదు/మనిషితనానికై తపిస్తూ/అగాధపు అంచుల్లో సైతం అదరక/అంకెండ్లతో మానవతను దేవుకోవడం" అంటాడు. కవి చిన్నతనం నుండి ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలు, చీదరింపులు, చిత్కారాల నుంచి పుట్టిందే ఈ కవిత్వం... అంటాడు. మొత్తం 50 కవితలున్న మొలాటు పుస్తకంలో ప్రతి కవిత పాఠకుడిని కదిలింప జేస్తుంది. సామాజిక సమస్యలే ఇతివృత్తాలుగా తీసుకొని, రాసిన కవితలు చదువుతుంటే, ఒక కవికి ఉండాల్సిన సామాజిక స్పృహ, బాధ్యత ఎటువంటిదో తెలియజేస్తూ పాఠకుడిని ఆలోచింపజేస్తుంది. "మొలాటు" అంటే విత్తనం వేసిన తర్వాత మొలకెత్తిన క్షేత్రశీ అని అర్థం. భూమి మీద ప్రతి విత్తనం మొలకెత్తి, ఏనుకొనిన దశ. కూకట్ల తిరుపతి రాసిన అన్ని పుస్తకాలకు దేశీయతను, అచ్చ తెలుగుదనాన్ని, అస్తిత్వాన్ని తెలిపే పేర్లనే పెడుతుంటాడు. అదేవిధంగా ఈ పుస్తకం పేరు కూడా "మొలాటు" అని పెట్టడం సహజంగా ఉంది. తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం వహించిన తను తెలంగాణ గురించి "నేను తెలంగాణను" కవితలో ఈ విధంగా అంటాడు. "నేను తెలంగాణను/అగ్ని గీతాల రుద్రవీణను/పోరాటాల పురిటి గడ్డను/నివురు గప్పిన పౌరుషాల నిప్పుల సెగను/దిక్కులు పిక్కటిల్లెల మోగిన యుద్ధ ఘోషను" అంటూ తెలంగాణ ఆత్మకథగా ప్రథమ పురుషలో సాగిన కవిత ఆద్యంతం పాఠకుడిని చైతన్య పరుస్తుంది. ఆనాటి పెత్తందార్ల ఆగడాలను ఉప్పుపాతరేసిన ఘట్టాలను గుర్తుకు తెస్తూ, మనల్ని తెలంగాణ ఉద్యమ కాలంలోకి తీసుకొని వెళుతుంది. కరోనా సమయంలో వలస కూలీల వెతలను తెలిపిన కవిత "వలస గోస"లో వారి వేదనాభరితమైన బాధలను, జీవితాలను ఎంతో హృద్యంగా చిత్రీకరించాడు.



**నయీమ్ పాషా**
- కవి రచయిత, ఖమ్మం.
9908916783

జీవాలతో ఊరికి దూరంగా అడవిలో తిరుగుతూ, తరతరాలుగా దగాపడ్డ జాతి తనదని చెప్పుకున్న కవి యొక్క కుంగుబాటు నుంచి పుట్టిన ఆక్రోశం, తిరుగుబాటు ధోరణి, కసి ఇతని రచనల్లో మనకు అడుగడుగునా కనబడుతుంది. "నిప్పుకుల కొలిమి" కవితలో "ఇకిలించే ఇజాల నిజాలు నెగ్గ తేల్చడానికి/నిరసన నిప్పుల కొలిమంటుకున్నది/అర్థబలపు కాటు/అంగబలపు మాటు/అధికారపు బలుపు పోటు/ఇంకానా ఇకపై సాగదని". సమాజంలోని అసమానతలపై, పెత్తందారుల దోపిడీపై బొగ్గులు బుక్కి, అగ్గి కక్కిన ఆకలిరక్కసి అంతం జూడ అక్షర కనికల కొలుమంటున్నదని, ఉద్వేకంతో ఆగ్రహావేశపు నిప్పులు కురిపించాడు కవి కూకట్ల. ఇంకా ఈ "మొలాటు" పొత్తంలో "బువ్వ చెట్టు" మొదలుకొని "నేను తెలంగాణను" కవిత వరకు సమకాలీన సందర్భానుసారంగా రాసిన సారవంతమైన కవితలు ఉన్నాయి. హృదయ విధారకమైన దృశ్యానికి, వస్తువుకు స్పందిస్తూ, చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా స్పష్టంగా చిక్కనైన జనపదం భాషలో తనదైన శైలిలో, ఆలోచనా ప్రేరకంగా రాశారు.

# రామగుండం ఎమ్మెల్యే దొంగ ఏడ్పు!

**నాడు ఏడ్చాడు.. నేడు ప్రజలను ఏడిపిస్తున్నాడు**

**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మండిపాటు**



గోదావరిఖని, ఏప్రిల్ 9 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా దొంగ ఓట్ల నిర్మూలన బీ.ఆర్.ఎస్ పార్టీ అధినాయకత్వం తీసుకున్న విధానాలకు కట్టుబడి రామగుండం నియోజకవర్గ బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన రామగుండం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒక్క ఓటు దుర్వినియోగం అయినా ఆయా అభ్యర్థుల భవితవ్యమే మారుతుందని అన్నారు. రామగుండం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చనిపోయిన వారి ఓటు ఉన్నా, ఇక్కడి నుండి వేరే చోటకు వెళ్ళినవారు ఉన్నా వారి ఓటును తొలగించే విధంగా అధికారులకు తెలియపర్చాలని అన్నారు. రామగుండం నియోజకవర్గంలో ప్రజలు ఎమ్మెల్యే పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఎన్నికలప్పుడు తమ వద్దకు వచ్చి ఏడ్చి ఇప్పుడు తమను ఏడిపిస్తున్నారని ఆవేదన చెందుతున్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్ళీ ఈ ప్రాంతంలోనే ఉండకుండా తరిమికొట్టడానికి రామగుండం నియోజకవర్గ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి మాజీ జెడ్పీటీసీ అముల నారాయణ, మురళీధర్ రావు, కౌశిక హరి, నడిపెల్లి మురళీధర్ రావు, మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు మేకల సమ్మయ్య యాదవ్, మేకల శారదా, కరక పద్మ, శ్రీనివాస్ రెడ్డి, తోకల రమేష్, గుర్రం ముత్యాలు, నారాయణదాసు, మారుతి, బోడ్డు రవీందర్, మెతుకు దేవరాజు, జెవీ రాజు, నూతి తిరుపతి, చెలుకలపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, కల్వచర్ల కృష్ణవేణి, బాదె అంజలి, ఇరుగురాళ్ల శ్రావణ్, కోలుగూరి సాయి కుమార్ (చింటూ), పిల్లి రమేశ్, గౌస్ బాబా, కిరన్ జీ విరాలాల్, బుర్రి వెంకటేష్, కోడి రామకృష్ణ, గుంపుల లక్ష్మి, గుర్రం పద్మ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మేల్ నర్సింగ్ ఆఫీసర్లకు న్యాయం చేయాలి

## జీవో 101 సవరణకు డిమాండ్: నక్క సూర్య కుమార్



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): పురుష నర్సింగ్ ఆఫీసర్లకు న్యాయం చేయాలని, జీవో 101ను సవరించాలని ఫ్లోరెన్స్ నైటింగేల్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు నక్క సూర్య కుమార్ డిమాండ్ చేశారు. గురువారం 101 జీవో నర్సింగ్ ఆఫీసర్స్ స్టేట్ జేఏసీ ప్రతినిధులు కోఠిలోని డిప్యూటీ డైరెక్టర్ విద్యుల్లతను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేల్ నర్సింగ్ ఆఫీసర్స్‌కు జరిగిన అన్యాయం, లింగ వివక్షత అంశాలను వివరంగా తెలియజేశారు. ఫిమేల్ నర్సింగ్ ఆఫీసర్స్‌కు ప్రమోషన్స్ ఇవ్వగా, మిగిలిపోయిన 105 పోస్టులను భర్తీ చేయకుండా ఉండటం అన్యాయమని అన్నారు. జీవో 101ను తక్షణమే సవరించి మేల్ నర్సింగ్ ఆఫీసర్స్‌కు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై డిప్యూటీ డైరెక్టర్ విద్యులత సానుకూలంగా స్పందించి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు కమిటీ ద్వారా రీమార్క్స్ త్వరగా పూర్తి చేసి, ఈ నెల 15వ తేదీలోపు ఫైల్‌ను ప్రభుత్వానికి పంపిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రాపోలు శేఖర్, వైస్ ప్రెసిడెంట్ నెల్లి విద్యాసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోట్ల ప్రవీణ్ కుమార్, మీడియా మేనేజర్ రాథోడ్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీరాంపురంలో 'స్వచ్ఛ రథం' ప్రారంభం

కాకినాడ, ఏప్రిల్ 9 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా శ్రీరాంపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "స్వచ్ఛ రథం" కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. గ్రామంలో చెత్తను తగ్గించి, పరిశుభ్రతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సోమేశ్వర రావు మాట్లాడుతూ ఈ స్వచ్ఛ రథం ద్వారా గ్రామస్తులు తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాల్సి ఉంటుంది. ముఖ్యంగా పేపర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు వంటి వ్యర్థాలకు ఖరీదు నిర్ణయించి, వాటిని కొనుగోలు చేసే విధానం అమలు చేస్తున్నారు. అదేవిధంగా షాంపూ ప్యాకెట్లు, సబ్బు కవర్లు, టీ పొడి ప్యాకెట్లు వంటి ప్లాస్టిక్ వ్యర్థాలను కేజీల లెక్కన సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో చెత్త తగ్గడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని అధికారులు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు కోరారు. గ్రామస్తులు కూడా ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, తమ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ససివాలయం సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.




## ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

**జగిత్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి సుజాత**

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గురువారం వాకథాన్ (రెడ్ రన్) ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి సుజాత కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ర్యాలీ కలెక్టర్ కార్యాలయం నుంచి రాజీవ్ బైపాస్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎం జి కృష్ణమూర్తి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు. వైద్య సిబ్బంది, నర్సింగ్ మరియు మెడికల్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు భారీగా హాజరయ్యారు. ర్యాలీ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి విధానం, నివారణపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కళాజాత బృందాలు పాటల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాయి. అనంతరం మాతా–శిశు సంరక్షణ కేంద్రంలో ట్రాన్స్‌జెండర్‌లకు వైద్య శిబిరం నిర్వహించి 27 మందికి పరీక్షలు చేశారు. అలాగే జిల్లా కేంద్ర కారాగారంలో 33 మంది ఖైదీలకు ఎయిడ్స్‌తో పాటు సిఫిలిస్, గనేరియా పరీక్షలు, టీబీ స్క్రీనింగ్, కంటి, దంత పరీక్షలు నిర్వహించారు.



## రైతుల సంక్షేమానికి పాటుపడుతా

**కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్.**

మల్లాపూర్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): మల్లాపూర్ రైతుల సంక్షేమానికి ఎల్లవేళలా పాటుపడుతానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుకు సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అల్లూరి లక్ష్మణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాంజీ గోండు వర్ధంతిని

# అధికారికంగా నిర్వహించాలి

**జాట్ రాష్ట్ర అధ్యక్షుడు పగడాకుల బాలస్వామి**



నిర్మల్, ఏప్రిల్ 9 (ఈవార్తలు):స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని దక్షిణ భారతదేశంలో అగ్నిజ్వాలలా రగిలించిన మహావీరుడు రాంజీ గోండు అని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (జాట్) రాష్ట్ర అధ్యక్షులు పగడాకుల బాలస్వామి అన్నారు. రాంజీ గోండు వర్ధంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్మల్‌లోని వేయి ఉరుల మర్రి ఘటనను రాష్ట్ర చరిత్రలో గౌరవప్రద స్థానం కల్పించాలన్నారు. 1860 ఏప్రిల్ 9న నిర్మల్‌లో ఒకే రోజున వెయ్యి మందికి పైగా దేశభక్తులను ఒకే వృక్షానికి ఉరివేసి హతమార్చిన బ్రిటిష్– నిజాం పాలకుల రాక్షస క్రీడా అత్యంత దారుణమన్నారు. ఆ దమనశక్తులూ ఆడిన రాక్షసక్రీడ భారత స్వాతంత్ర్య చరిత్రలో అత్యంత క్రూరమైన ఘటనలలో ఒకటని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణ సంఘటనను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించి, వెయ్యి మంది దేశభక్తులను స్మరిస్తూ అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ.. "రాంజీ గోండు వంటి మహావీరుల త్యాగాల చరిత్ర పాఠ్యాంశాల్లోనూ, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ సముచిత స్థాయిలో నిలబెట్టుకోవాలన్నారు. అప్పుడే చరిత్రకు న్యాయం జరుగుతుందన్నారు. "తెలంగాణ మట్టిలో స్వాతంత్ర్య జ్యోతి వెలిగించిన రాంజీ గోండు వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు. లేదంటే అమరవీరుల త్యాగాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా మిగిలిపోతుందని హెచ్చరించారు. 'ప్రతి సంవత్సరం రాంజీ గోండు వర్ధంతిని అధికారికంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలి. నిర్మల్‌లోని వేయి ఉరుల మర్రిని రాష్ట్ర వారసత్వ – స్మారక చిహ్నంగా అభివృద్ధి చేయాలి. అమరవీరుల స్మృతిని ప్రతిబింబించేలా ప్రత్యేక మ్యూజియం నిర్మించాలి. పాఠ్యపుస్తకాల్లో రాంజీ గోండు పోరాట చరిత్రను చేర్చాలి. ఏప్రిల్ 9ను నిర్మల్ అమరవీరుల స్మృతి దినంగా ప్రకటించాలి' అనిబాలస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాలను గౌరవించడంలో ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం వీడి తక్షణ నిర్ణయం తీసుకోవాలన్నారు. "వేయి ఉరుల మర్రి కేవలం ఒక చెట్టు కాదు.. అది తెలంగాణ ఆత్మగౌరవానికి, స్వాతంత్ర్య త్యాగాలకు చిరస్థాయి చిహ్నం" అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు వేయి మంది దేశభక్తులను ఉరి తీసిన మహా వృక్షం పరిసరాలను పరిశీలించి, నాటి వీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జాట్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి రాసం శ్రీధర్, రాష్ట్ర కోశాధికారి చిలుకూరి అఖిలేష్, విశ్వహిందూ పరిషత్ నాయకులు రాజేందర్, రాజు, దేశభక్తులు, కార్యకర్తలు పాల్గొని అమరవీరులకు నివాళులు అర్పించారు.

# జీవన్ రెడ్డి ఇంటి వద్ద తోపులాట

**జర్నలిస్టులకు గాయాలు**



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): జగిత్యాలలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా ఉద్రిక్తతకు దారితీశాయి. మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసం వద్ద జరిగిన తోపులాటలో మీడియా ప్రతినిధులు గాయపడటం, వారి పరికరాలు ధ్వంసం కావడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులతో కలిసి జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ఒక్కసారిగా లోపలికి దూసుకురావడంతో అక్కడ తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. అదుపుతప్పిన కార్యకర్తలు అక్కడ విధుల్లో ఉన్న మీడియా ప్రతినిధులపై పడిపోవడంతో పలువురు జర్నలిస్టులకు గాయాలయ్యాయి. తోపులాటలో ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఖరీదైన వీడియో కెమెరాలు కిందపడి ధ్వంసమయ్యాయి. కాగా, సాయిని ఆసుపత్రిలో ప్రముఖ నాయకులు పరామర్శించారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ, సాయి వైద్య పరీక్షల నివేదికలను పరిశీలించామని, ఎలాంటి ప్రాణాపాయం లేదని, స్వల్ప గాయాలే అయ్యాయని తెలిపారు. ఆయన త్వరలోనే కోలుకుంటారని అన్నారు. అలాగే సాయి చికిత్సకు సంబంధించిన పూర్తి ఖర్చులను తాము భరిస్తామని కేటీఆర్ చెప్పినట్లు నాయకులు వెల్లడించారు.



## కృష్ణవేణిలో ఘనంగా

# ఫేర్‌వెల్ సెలబ్రేషన్స్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు విద్యార్థుల ఆనందం, భావోద్వేగాల నడుమ ఉత్సాహభరితంగా సాగాయి. ఈ సందర్భంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులు తమ సీనియర్లకు ప్రత్యేకంగా వీడ్కోలు అందిస్తూ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేదికను అలరించారు. పాటలు, డ్యాన్సులు, వినోదాత్మక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్నేహ బంధాలు, జ్ఞాపకాలతో నిండిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో భావోద్వేగాలను రేకెత్తించింది. పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ శేఖర్ రెడ్డి, ట్రస్మా నాయకులు శ్రీధర్ రావు, జగన్ మోహన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జీవన్ రెడ్డికి ఏం తక్కువ చేశాం?

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఫైర్**

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి విమర్శలు సరికావని, ఏఐసిసి నిర్ణయం మేరకు ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకున్నామని, జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఏమి తక్కువ చేయలేదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని మోతె రోడ్డు గల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీలో ఉన్నా మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా జీవన్ రెడ్డిని కలిసి బుజ్జగించినా, ఆయన తొందరపడి కాంగ్రెస్ పార్టీ వీడారన్నారు. 2014 నుండి 2023 వరకు మాజీ సీఎం కేసిఆర్, బిఆర్ఎస్ పార్టీని అందరి కంటే ఎక్కువ విమర్శించిన జీవన్ రెడ్డి ఇప్పుడు అదే పార్టీ తీర్థం పుచ్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రెండేళ్లలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని వ్యాఖ్యానించడం సబబుకాదన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, డిసిసి అధ్యక్షుడు గాజెంగి నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, సీనియర్ నాయకులు బండ శంకర్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ వాహనాలు కండీషన్‌లో ఉండాలి

**అధికారులకు జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ వాణి ఆదేశాలు**



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): మున్సిపల్ కు సంబంధించిన వాహనాలకు త్వరగా మరమ్మత్తులు చేయించాలని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం విద్యానగర్ లోని వాటర్ ట్యాంక్ వద్ద జేసీబీ యంత్రానికి మరమ్మత్తులు పూర్తి కాగా చైర్పర్సన్ వాణి ప్రత్యక్షంగా పరిశీలించి, పూర్తిస్థాయిలో వినియోగించి సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. మిగితా వాహనాలకు సైతం త్వరగా మరమ్మత్తులు చేయించాలని, నిర్వహణ లోపం వల్ల ఎట్టి పరిస్థితుల్లో రిపేర్ కావద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్, కూతురు రాజేష్, కూతురు శేఖర్, ఖాజా కమలుద్దీన్, పిట్ట ధర్మరాజు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమికి దత్తపుత్రికగా షర్మిల: రోజా

తాడేపల్లి, ఏప్రిల్ 9 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన విమర్శలకు వైసీపీ నేత రోజా గట్టిగా బదులిచ్చారు. కూటమి పార్టీలకు షర్మిల దత్తపుత్రికగా మారారని విమర్శించారు. "అలాంటి మీకు మా నాయకుడు జగన్ గురించి మాట్లాడే అర్హత ఉందా?" అని రోజా సూటిగా ప్రశ్నించారు. "కోట్లాది మంది దేవుడిగా పూజించే వైయస్ఆర్ గారిని జీవితాంతం వ్యతిరేకించిన చంద్రబాబుతో చేతులు కలిపింది మీరు కాదా? జగన్ గారి పతనం కోసం తపనపడుతున్నది మీరు కాదా? జాతీయ స్థాయిలో కూటమి పార్టీలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తే మీరు మాత్రం ఇక్కడ ఎందుకు చేతులు కలిపారో ప్రజలకు తెలియదనుకుంటున్నారా? వైయస్ఆర్ గారికి నిజమైన వారసుడు మా జగనన్నే అని ప్రజలు ఎప్పుడో నిర్ణయించారు. రాష్ట్ర రాజకీయాలను, ప్రజల భవిష్యత్తును పేకాటగా చూస్తున్న మీకు రాజకీయ పరిణితి ఏ మాత్రం ఉందో అర్థమవుతోంది" అంటూ రోజా విమర్శనాస్త్రాలు సంధించారు.

## సెల్ఫీ మోజులో ముగ్గురు విద్యార్థినుల మృతి

అల్లూరి జిల్లా, ఏప్రిల్ 9 (ఈవార్తలు): ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో అదుపుతప్పి జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన అనంతగిరి మండలం మూలగుమ్మి సమీపంలోని జలపాతం వద్ద జరిగింది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే, హుకుంపేట మండలం జుంబువలస గ్రామానికి చెందిన త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16) ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. మరో స్నేహితురాలు అంజలితో కలిసి నలుగురూ అనంతగిరిలోని జలపాతాన్ని చూసేందుకు వెళ్లారు. అక్కడ జలపాతం అంచున నిలబడి సెల్ఫీ దిగుతుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయారు. ఈ ప్రమాదంలో త్రిష, రత్నకుమారి, పవిత్ర అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అంజలిని స్థానికులు గమనించి లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు.

# పల్లె పల్లెకు ప్రజారోగ్యం

**(చిట్టచివరి వ్యక్తికీ ఆరోగ్య సంరక్షణ)**

అందరికీ సమానమైన, సమ్మిళితమైన, సంపూర్ణమైన ఆరోగ్య మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యం దిశగా భారత్ ముందుకు సాగుతోంది. ఈ తరుణంలో చిట్టచివరి గ్రామంలోని చివరి వ్యక్తికి సరైన సమయంలో నాణ్యమైన సేవలు అందుతున్నాయని మనం ఎలా నిర్ధారించుకోవాలన్న ప్రాథమిక ప్రశ్నను మనం వేసుకోవాలి.

**ఈ ప్రశ్నకు సమాధానం మౌలిక సదుపాయాలను విస్తరించడంలో లేదా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించడంలో మాత్రమే కాకుండా.. అందరికీ అందుబాటులో ఉండే, చౌకగా లభించే, ప్రజలు విశ్వసించే వ్యవస్థలను బలోపేతం చేయడంలో కూడా ఉంది. ఈ నేపథ్యంలో భారతీయ సంప్రదాయ వైద్య విధానాలతో పాటుగా హోమియోపతి కూడా గొప్ప చికిత్సా విధానంగా మారుతోంది. క్షేత్ర స్థాయిలో సమగ్ర ఆరోగ్య మౌలిక సదుపాయాలను మారుస్తోంది.**



గిరిజన ప్రాంతాలు, మారుమూల గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో వైద్యసేవలు తగినంతగా అందుబాటులో లేని ప్రదేశాల్లో వైద్య సేవలను పొందడంలో ఎదురవుతున్న అంతరాన్ని హోమియోపతి ఎలా భర్తీ చేస్తోందో మనం చూస్తున్నాం. కేవలం విస్తృతిపైనే కాకుండా, సమాజంలో చివరి అంచె వరకూ చేరుకోగలిగిన సామర్థ్యం పైనే ఈ వైద్య విధానం ప్రభావం నిర్వచితమవుతోంది. ఏప్రిల్ 10న ప్రపంచ హోమియో దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది "సుస్థిర ఆరోగ్యానికి హోమియోపతి" అనే ఇతివృత్తంతో దీనిని జరుపుకొంటున్నాం. ఈ వైద్యవిధానం వ్యక్తి ఆరోగ్యంతో పాటుగా సరసమైన, పర్యావరణ హితమైన, సామాజిక సమ్మిళిత్వం నిండిన సమగ్ర ఆరోగ్య విధానానికి పెద్దపీట ఎలా వేస్తుందో చర్చించుకోవాల్సిన సమయమిది. 18 శతాబ్దంలో శామ్యూల్ హానిమన్ హోమియోపతిని అభివృద్ధి చేశారు. ఈ వైద్య విధానం 19వ శతాబ్దంలో భారత్‌లో అడుగుపెట్టింది. సిమిలియా సిమిలిబస్ క్యురెంటర్ – అంటే.. 'వ్యాధికి కారణమయ్యేదే వ్యాధిని తగ్గిస్తుంది' అనే సూత్రం ఆధారంగా ఈ వైద్య విధానాన్ని అభివృద్ధి చేశారు. కాలం గడిచే కొద్దీ దేశంలో అనుసరిస్తున్న బహుళ ఆరోగ్య, సరంక్షణ విధానాల్లో ముఖ్యమైన భాగంగా పరిణామం చెంది, సంపూర్ణమైన రోగి-కేంద్ర విధానాన్ని హోమియోపతి అందిస్తోంది. వైద్య సేవలను నిరంతరాయంగా అందించగలిగే సామర్థ్యమే హోమియోపతిని క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా నిలబెడుతోంది. అనేక వెనకబడిన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అంటే అప్పుడప్పుడూ లభించేవిగా ఉండకూడదు. అవి నిరంతరం అందుబాటులో ఉండాలి. ప్రధానంగా దీర్ఘకాల ఆరోగ్య సమస్యలు, పునరావృతమయ్యే ఇన్ఫెక్షన్లు, జీవనశైలి రుగ్మతలను తగ్గించడంలో వ్యక్తి అవసరాలకు అనుగుణంగా హోమియోపతి చికిత్సను అందిస్తుంది. అలాగే రోగికి, వైద్యునికీ మధ్య దీర్ఘకాలిక అనుబంధాన్ని పెంపొందిస్తుంది. ఫలితంగా చికిత్స, మొత్తం ఆరోగ్య ఫలితాలు గణనీయంగా మెరుగవుతాయి.



ప్రస్తుతం దేశంలో 290కి పైగా హోమియోపతి వైద్య కళాశాలు, ఆసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో హోమియోపతి వైద్యులున్నారు. వాస్తవానికి హోమియోపతి ప్రభావం సంస్థల్లో కాకుండా.. క్షేత్ర స్థాయిలోనే బాగా అర్థం చేసుకోగలం. జార్ఖండ్‌లోని గిరిజన జిల్లాలు, ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని మారుమూల తండాల్లో ఒక్క వైద్యుడు ఉన్నా సరే.. ఆయా ప్రాంతాల్లో సామాజిక ఆరోగ్యాన్ని మార్చేయగలుగుతారు.

సరళత్వమే హోమియోపతికున్న ముఖ్యమైన బలాల్లో ఒకటి. ఈ ఔషధాలు చౌకగా, సులభంగా రవాణా చేయగలిగేలా ఉంటాయి. వీటిని నిల్వ చేయడానికి ఎలాంటి ప్రత్యేకమైన మౌలిక వసతుల అవసరం లేదు. ఈ లక్షణాలు సరఫరా వ్యవస్థలు బలహీనంగా ఉండే, సేవా సిబ్బంది పరిమితంగా ఉండే ప్రాంతాల్లో అమూల్యమైనవిగా మారతాయి. మన జనాభాలో గణనీయమైన వాటా ఉన్న, తరచూ ఏదో ఒక ఆరోగ్య సమస్యను ఎదుర్కొనే గిరిజన సమాజాల సంస్కృతికి అనుగుణంగా వారికి వైద్య సేవలను అందించాలి. సునితత్వంతో కూడిన, శస్త్ర చికిత్సలు అవసరం లేని హోమియోపతి.. సంప్రదాయ చికిత్సా పద్ధతులను ప్రతిబింబిస్తుంది. ఫలితంగా ఇది ఆమోదాన్ని పొంది, అందరికీ చేరువ అవుతోంది. ఈ అంశాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. ప్రధాన ఆరోగ్య సేవల్లో హోమియోపతిని భాగంగా చేసేందుకు అనేక చర్యలు చేపట్టింది. జాతీయ ఆయుష్ కార్యక్రమం పరిధిలో 12,500కు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఇవి క్షేత్ర స్థాయిలో హోమియోపతితో సహా ప్రాథమిక ఆరోగ్య సేవలను అందిస్తున్నాయి.

ముఖ్యంగా, ఒకరి నుంచి ఒకరికి సంక్రమించని వ్యాధుల పట్ల భారత్ అనుసరిస్తున్న విధానానికి హోమియోపతి విశేష సహకారం అందిస్తోంది. కేంద్ర హోమియోపతి పరిశోధనా మండలి (సీసీఆర్‌హెచ్) మధుమేహం, హృద్రోగాలు, ఇతర దీర్ఘకాల ఆరోగ్య సమస్యలకు చికిత్సను అందించే జాతీయ కార్యక్రమాల్లో హోమియోపతిని భాగం చేసింది. ఇది ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను మించి దాని స్థాయిని ప్రదర్శిస్తుంది. వినూత్న సేవా పంపిణీ విధానాలు రూపుదిద్దుకుంటున్న వైనం కూడా అంతే ప్రోత్సాహకరంగా ఉంది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ఆరోగ్య సేవలను ఒకే గొడుగు కింద అందించడం వల్ల వాటిని పొందే సౌలభ్యం, విశ్వసనీయత రెండూ మెరుగుపడ్డాయి. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు మొబైల్ మెడికల్ యూనిట్లు సేవలు అందిస్తున్నాయి. విభిన్న ప్రజారోగ్య పరిస్థితుల్లో హోమియోపతి ప్రభావాన్ని సామాజిక అవగాహనా కార్యక్రమాలు, అంటువ్యాధుల నియంత్రణా కార్యక్రమాలు తెలియజేశాయి. హోమియోపతి ప్రాథమికాంశాల్లో శిక్షణ పొందిన ఆరోగ్య కార్యకర్తలే ఈ విధానం విస్తరణకు కారణం అయి ఉండొచ్చు. సరైన విజ్ఞానం, సంప్రదింపుల వ్యవస్థల తోడ్పాటు ఉంటే.. ఈ కార్యకర్తలే తక్కువ ఖర్చుతో అందించే మెరుగైన ఆరోగ్య సేవల పరిధిని గణనీయంగా విస్తరించగలుగుతారు. అర్థవంతమైన ఫలితాలను సమాజ నేతృత్వ విధానాలు ఎలా సాధించగలవో సీసీఆర్‌హెచ్ చేపడుతున్న స్వాస్థ్య రక్ష, ఇతర అవగాహనా కార్యక్రమాలు నిరూపించాయి.



**- ప్రతాప్‌రావ్ జాదవ్,**
**కేంద్ర ఆయుష్ మంత్రి**
**(స్వతంత్ర హోదా)**

భవిష్యత్తు వైపు మనం చూస్తున్నప్పుడు.. సుస్థిరమైన ఆరోగ్యానికి, సంక్షేమానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని తగ్గించకూడదు. పెరుగుతున్న వైద్య సేవల ఖర్చులు, అధికమవుతున్న దీర్ఘకాలిక వ్యాధుల భారం, యాంటిమైక్రోబియల్ నిరోధకత్వం లాంటి కొత్త సవాళ్లకు సమర్థమైన, ఆర్థికంగా, పర్యావరణపరంగా ఆచరణీయమైన పరిష్కారాలు అవసరం. సహజంగానే హోమియోపతి ఈ దార్శనికతకు అనుగుణంగా ఉంటుంది. తక్కువ వ్యయంతో కూడిన ఈ చికిత్సా విధానాలు.. కుటుంబాలు, ప్రజారోగ్య వ్యవస్థలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయి. అదే సమయంలో పర్యావరణంపై అత్యల్ప ప్రభావాన్ని చూపించే బాధ్యతాయుతమైన ఆరోగ్య, సంరక్షణ ప్రక్రియలకు తోడ్పాటును అందిస్తాయి. వెనకబడిన ప్రాంతాల్లో శిక్షణను బలోపేతం చేయడం, నిరంతరం ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడటం, విస్తృత పరిశోధన, డాక్యుమెంటేషన్‌ను ప్రోత్సహించడం, ఆరోగ్య కార్యకర్తలకు సాధికారత కల్పించడంపై మన దృష్టిని కేంద్రీకరించాలి.

భౌగోళిక, సామాజిక, ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా ప్రతి పౌరునికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందినప్పుడే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుంది. సమాజంతో గాఢమైన అనుబంధం, సుస్థిరమైన విధానంతో ఈ లక్ష్యాన్ని సాధించే మార్గాన్ని హోమియోపతి అందిస్తుంది. అత్యంత అధునాతన సౌకర్యాలు మన ఆరోగ్య వ్యవస్థకు అసలైన కొలమానం.. సమాజంలో అట్టడుగును ఉన్నవారికి సేవలు అందించే సామర్థ్యంలో ఉంది. అత్యంత అధునాతన సౌకర్యాల్లో కాదు. ఓ మారుమూల గ్రామంలోని కుటుంబానికి సులభమైన, చౌకైన సేవలు ఉపశమనం కలిగించినప్పుడు.. భారతదేశంలో ఆరోగ్యసేవలు మరింత సమ్మిళితంగా, మానవతా దృక్పథంతో నిండి, సార్వత్రికంగా అందుబాటులో ఉన్నాయనే శక్తిమంతమైన ఆలోచన బలోపేతమవుతుంది.

## హోమియోపతి వైద్యానికి ఆయుష్షు

**సంప్రదాయ వైద్య విధానానికి కేంద్రం ప్రోత్సాహం**

**ఆయుష్ ద్వారా మరింత అందుబాటులోకి హోమియో**

**నేడు ప్రపంచ హోమియోపతి దినోత్సవం**

**రెండు రోజుల పాటు ఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమాలు**



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఈవార్తలు): హోమియోపతి వైద్యం పట్ల భారతీయుల్లో ప్రత్యేక విశ్వాసం ఉంటుంది. ఈ సంప్రదాయ వైద్యంతో అనారోగ్య సమస్యలు తగ్గుతాయనేది అనేక దశాబ్దాలుగా ఉన్న నమ్మకం. ప్రజాదరణ పొందిన హోమియోపతి వైద్యాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తోంది. 2014లో ఏర్పాటుచేసిన ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా హోమియో వైద్య పరిశోధన, ప్రామాణీకరణను మరింత సమర్థంగా మార్చడంతో పాటు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తోంది. ఈ ప్రయత్నాలు హోమియో వైద్యాన్ని సంప్రదాయ చికిత్సా విధానం నుంచి భారతదేశ వైద్య వ్యవస్థలో ప్రాముఖ్యత కలిగిన, ముఖ్యమైన భాగంగా మార్చాయి. ఈ ప్రయత్నాలను కొనసాగిస్తూ.. ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నేడు, రేపు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

### హోమియో వైద్య చరిత్ర

శామ్యూల్ హానేమన్ అనే జర్మన్ వైద్యుడు 1796లో హోమియోపతి వైద్యాన్ని ప్రారంభించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగానే ప్రపంచ హోమియోపతి దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సంవత్సరం "సుస్థిర ఆరోగ్యానికి హోమియోపతి" అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం జరుగుతోంది. గ్రీక్ పదాలైన హోమొయిస్(సారూప్య), పాథోస్(బాధ) నుంచి హోమియోపతి పదం పుట్టింది. మొక్కలు, ఖనిజాలు, జంతు పదార్థాలు వంటి సహజ వనరుల ద్వారా హోమియోపతి మందులను తయారుచేస్తారు. కేవలం వ్యాధి కేంద్రీకృతంగా కాకుండా రోగి శారీరక, మానసిక పరిస్థితిని బట్టి వైద్యం అందించడం హోమియోపతి ప్రత్యేకత.

### భారతీయుల్లో చెదరని విశ్వాసం

భారత్‌లోకి 19వ శతాబ్దంలో హోమియోపతి ప్రవేశించింది. 1847లోనే తమిళనాడులోని తంజావూరులో హోమియోపతి ఆసుపత్రి ప్రారంభమైంది. దేశంలో అనేక ఏళ్లుగా ప్రజలు హోమియో వైద్యాన్ని విశ్వసిస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగానే వైద్య సదుపాయాలు కూడా పెరిగాయి. ప్రపంచంలో హోమియోపతి వైద్యులు, నిపుణులు ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. మన దగ్గర 3,45,404 రిజిస్టర్డ్ హోమియో వైద్యులు, 277 హోమియోపతి కళాశాలలు, 34 పరిశోధన సంస్థలు, 384 హోమియో మందుల తయారీ సంస్థలు, 8,593 డిస్పెన్సరీలు ఉన్నాయంటే దేశంలో హోమియో వైద్యానికి ఎంత ఆదరణ ఉందో అర్థం చేసుకోవచ్చు.

### పదేళ్లుగా ఎంతో ప్రోత్సాహం

దేశంలో సంప్రదాయ వైద్యానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2014లో ఆయుష్ మంత్రిత్వ శాఖను నెలకొల్పింది. దీని కింద హోమియోపతిని ప్రోత్సహిస్తోంది. దేశంలో 2013-14లో 190 హోమియోపతి యూజీ కళాశాలలు ఉండగా ఇప్పుడు 287కు పెరగడం, పీజీ కళాశాలలు 30 నుంచి 82కి పెరగడమే ఇందుకు ఉదాహరణ. దీంతో పాటు 2013-14లో యూజీ సీట్లు 14,464 ఉండగా, ఇప్పుడు 23,048కి పెరిగాయి. పీజీ సీట్లు 642 నుంచి 2,112కి పెరిగాయి.

### ఆయుష్ ఏర్పాటుతో పునర్వైభవం

ఆయుష్ మంత్రిత్వ శాఖ హోమియోపతి వైద్యానికి పునర్వైభవం తెచ్చింది. ఈ శాఖ చేపట్టిన జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమం హోమియోపతి వైద్యాన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రధాన వైద్య సేవల్లో భాగంగా మార్చింది. ఆయుర్‌స్వస్థ్య కార్యక్రమం ద్వారా పరిశోధనలు, క్లినికల్ శిక్షణను, సామర్థ్యాల పెంపును బలోపేతం చేసింది. ఆయుర్‌జ్ఞాన్ ద్వారా వర్క్‌షాపులు, సెమినార్‌లను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా భారతదేశంలో హోమియో వైద్యాన్ని మరింత అందుబాటులోకి తెచ్చేందుకు, విస్తృత పరిశోధనలు జరిగేందుకు కేంద్రం ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

## బెంగాల్‌లో బీజేపీదే పీఠం

**అద్భుత విజయం సాధిస్తుంది**

**చరిత్రను తిరగరాసే ఎన్నికలు ఇవి**

**ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం**



న్యూఢిల్లీ: బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, బీజేపీ అద్భుత విజయం సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. హల్దియాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో మమతా బెనర్జీ ఓడిపోయారని గుర్తు చేశారు. ఈసారి రాష్ట్రమంతా అదే ఫలితం వస్తుందని అన్నారు. ఇప్పుడు భవానీపూర్‌లో (మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు) కూడా అదే ఫలితం వస్తుందని అన్నారు. ఈ ఎన్నికలు బెంగాల్ అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఉపయోగపడే ఎన్నికలు అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధి విషయంలో అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు రంగాల్లో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ మోసాలు ప్రజల ముందు ఉంచుతామని మోదీ పేర్కొన్నారు. బెంగాల్ యువతను తృణమూల్ కాంగ్రెస్ ఎంతో మోసం చేసిందని, ఆ పాపాలు ఊరికే పోవని హెచ్చరించారు. బెంగాల్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ రాగానే కేంద్ర పథకాలు ఇక్కడ అమల్లోకి వస్తాయని హామీ ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ హయాంలో జరిగిన అన్యాయాలు, కుంభకోణాలపై విచారణ జరిపి, కారకులైన వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. శరణార్థులకు ఆశ్రయమిస్తామని, కానీ చొరబాటుదారులను తరిమికొడతామని స్పష్టం చేశారు.



## భారత్ చేరిన గ్రీన్ ఆశా

ముంబై: పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నడుమ, భారత ఇంధన సరఫరా వ్యవస్థలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. 'గ్రీన్ ఆశా' అనే భారతీయ జెండా కలిగిన ఎల్‌పీజీ నౌక, 15,400 టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ)తో గురువారం నవీ ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ (జేఎన్‌పీఏ)కు సురక్షితంగా చేరుకుంది. భౌగోళికంగా అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటిన ఈ నౌక, జేఎన్‌పీఏలోని భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్) నిర్వహిస్తున్న లిక్విడ్ బెర్త్‌లో లంగరు వేసింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ప్రారంభమైన తర్వాత జేఎన్‌పీఏకు చేరుకున్న మొట్టమొదటి ఎల్‌పీజీ నౌక ఇదే కావడంతో దీనిని ఒక ముఖ్యమైన మైలురాయిగా అధికారులు అభివర్ణించారు. నౌకలోని సిబ్బంది, కార్గో అంతా సురక్షితంగా ఉన్నట్లు జేఎన్‌పీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి హార్మూజ్ జలసంధిని దాటిన ఎనిమిదో భారత నౌక 'గ్రీన్ ఆశా'. క్లిష్టమైన భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లోనూ దేశానికి అవసరమైన నిత్యావసర సరుకుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించే భారత సముద్ర రవాణా సామర్థ్యానికి ఈ సంఘటన నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నౌక రాకతో దేశీయ ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థకు మరింత భరోసా లభించినట్లయింది.

వయ్యారి చిత్రం


కంగనా శర్మ





## త్రిషతో రిలేషన్.. విజయ్ క్లారిటీ?

తన వ్యక్తిగత జీవితం, పొలిటికల్ జర్నీపై వస్తున్న ఆరోపణలన్నీ ఎన్నికల ముందు కావాలని క్రియేట్ చేసినవని టీవీకే అధినేత విజయ్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇవన్నీ తనను బలహీనపరచడానికి ప్రత్యర్థులు చేస్తున్న కుట్రలేనని ఆరోపించారు. ఎన్నికలకు ముందు తనను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత జీవితాన్ని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా విజయ్ మీద ఏదో ఒక వివాదం సృష్టించడం వాళ్లకు అలవాటైపోయిందని ఎద్దేవా చేశారు. గతంలో కరూర్ తొక్కిసలాట ఘటన విషయంలో అదే జరిగిందని తెలిపారు. అంతే కాదు.. తన మూవీ జన నాయగన్ విషయంలో కూడా అదే చేశారని ఆరోపించారు. ముఖ్యంగా ఆ సినిమా విడుదలను అడ్డుకోవడానికి కూడా ప్రయత్నాలు జరిగాయని ఆరోపణలు చేశారు. అది సరిగ్గా కుదరకపోవడం వల్ల వ్యక్తిగత జీవితంపై దృష్టి మళ్లించారని తెలిపారు. తన సినిమాను ఆపలేకపోయినప్పుడు, తన కుటుంబ విషయాలను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. ఎన్నికలకు కేవలం 30 రోజులు మాత్రమే ఉండగా ఇలాంటి రూమర్లు స్ప్రెడ్ చేయడం వెనుక రాజకీయ ఉద్దేశ్యాలు ఉన్నాయని క్లియర్ గా తెలుస్తుందని అన్నారు. తనకు దగ్గరగా ఉన్న వారిని కూడా వివాదాల్లోకి లాగుతున్నారని తెలిపారు. మీరు అర్థం చేసుకుంటున్నారు కదా తాను ఏమి చెబుతున్నానో అంటూ క్లారిటీ ఇచ్చే కూడా ప్రయత్నం చేశారు. అలా ఎవరి పేరును ప్రస్తావించకుండా స్పందించిన విజయ్.. తనను ప్రజల నుంచి వేరు చేయాలని ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని ధీమా వ్యక్తం చేశారు. ఎంత ప్రయత్నించినా తనను ప్రజల నుంచి దూరం చేయలేరని తెలిపారు. ప్రజలే తన బలమని చెప్పారు. ఏదేమైనా రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తనపై వస్తున్న విమర్శలు, వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఆరోపణలపై విజయ్ ఎట్టకేలకు స్పందించడంతో.. ఆయన కామెంట్స్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. భార్యతో విడాకులు, త్రిషతో రిలేషన్ వంటి విషయాలపై విజయ్ క్లారిటీ ఇచ్చినట్లేనా అంటూ అంతా ఇప్పుడు సోషల్ మీడియాలో డిస్కస్ చేసుకుంటున్నారు.

## అతనికి దూరం కాలేదు: సమంత

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో కలిసి సమంత నటించిన ఫ్యామిలీ రొమాంటిక్ డ్రామా -ఖుషి-. ఈ మూవీ తరువాత వ్యక్తిగత సమస్యల కారణంగా కాస్త బ్రేక్ తీసుకున్న సమంత ప్రొడ్యూసర్‌గా, నటిగా మళ్లీ రెట్టించిన ఉత్సాహంతో సినిమాలు చేయడం మొదలు పెట్టింది. నాగచైతన్యతో విడాకుల అనంతరం కొంత మానసిక ఒత్తిడికి గురైనా ఆ తరువాత -ది ఫ్యామిలీ మ్యాన్- సిరీస్ డైరెక్టర్లలో ఒకరైన రాజ్



నిడిమోరుని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఆయన సహకారంతో నిర్మాణ సంస్థని స్థాపించి చిన్న సినిమాలకు నిర్మాతగా సమంత శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబర్ 1న దర్శకుడు రాజ్ నిడిమోరుని వివాహం చేసుకన్న సామ్ కొత్త లైవ్‌ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే భర్త రాజ్ నిడిమోరుపై తన ప్రేమని వ్యక్తం చేసిన సమంత తాజాగా ఆసక్తికరంగా స్పందించింది. రాజ్‌తో భావోద్వేగ భద్రతను, నమ్మకాన్ని పొందానని వెల్లడించింది. అంతే కాకుండా తాజాగా మరింత ఆసక్తికరంగా స్పందించి ఆశ్చర్యపరుస్తోంది.



## సాన్యా మల్హోత్రా బ్రేకప్!

దంగల్- సినిమాతో దేశవ్యాప్త గుర్తింపు పొందిన నటి సాన్యా మల్హోత్రా.. తన ప్రియుడు రిషబ్ రిఖిరామ్ శర్మ నుంచి విడిపోయినట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం.. సాన్యా మల్హోత్రా - రిషబ్ రిఖిరామ్ ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. కేవలం అన్‌ఫాలో చేయడమే కాకుండా.. గతంలో కలిసి దిగిన ఫోటోలను.. స్వీట్ మెమరీస్ ను కూడా తమ సోషల్ మీడియా ఖాతాల నుండి తొలగించినట్లు తెలుస్తోంది. సెలబ్రిటీల ప్రపంచంలో ఇలా ఫోటోలు తొలగించడం, అన్‌ఫాలో చేసుకోవడం అనేది సాధారణంగా విడిపోవడానికి సంకేతంగా భావిస్తారు. రిషబ్ రిఖిరామ్ శర్మ సంగీత ప్రపంచంలో ముఖ్యంగా సితార్ వాయిద్యంలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన వ్యక్తి. మరోవైపు సాన్యా మల్హోత్రా తన కెరీర్ పరంగా ప్రస్తుతం చాలా బిజీగా ఉన్నారు.



## దేనికైనా టైం రావాలి

మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు.. ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా ఆఫర్స్ అందుకుంటూ బిజీ లైఫ్ లీడ్ చేస్తుంది. ఆమె నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. కోలీవుడ్ వర్సటైల్ యాక్టర్ సూర్య, సెన్సిబుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్టు సంబంధించిన షూటింగ్ ప్రజెంట్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో భాగంగానే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినిమాపై ఆసక్తికర కామెంట్స్ చేసింది మమిత. 'విశ్వనాథ్ అండ్ సన్స్ చిత్రంలో ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు బలమైన ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంటుంది. ఇది ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా రూపొందగా.. ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తిస్థాయిలో ఎగ్జైట్‌మెంట్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. నన్ను నమ్మండి.. ఈ సినిమా అద్భుతంగా ఉ ఒడబోతోంది' అని తెలిపింది. అలాగే తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. 'నేను మలయాళ చిత్రసీమలో నా ప్రయాణాన్ని ఒక సహాయ నటిగా ప్రారంభించాను. ఇప్పుడు ప్రధాన పాత్రల వైపు అడుగులు వేస్తున్నాను. ప్రతి విషయాన్ని దశలవారీగా ముందుకు తీసుకెళ్లడాన్ని నేను విశ్వసిస్తాను.. ఎందుకంటే మనకు దక్కాల్సినవి సరైన సమయానికి తప్పక మనల్ని చేరుతాయి' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

## విరోష్‌కు ఖరీదైన బంగ్లా

దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న రష్మిక మందన్నకు ఈ ఏడాది పుట్టినరోజు అత్యంత ప్రత్యేకంగా నిలిచింది. తన 30వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా తన తండ్రి మదన్ మందన్న ఒక అద్భుతమైన సర్‌ప్రైజ్ ఇచ్చారు. కూతురిపై ఉన్న మమకారంతో అతడు ఒక అత్యంత ఖరీదైన విలాసవంతమైన బంగ్లాను రష్మికకు బహుమతిగా అందించారు. ఈ కొత్త నివాసానికి ఆయన -సెరినిటీ- అని పేరు పెట్టడం విశేషం. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే ఈ పేరుతో ఉన్న బంగ్లాను చూసి రష్మిక ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. తన తండ్రి తనపై చూపిస్తున్న నిరంతర ప్రేమ తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని తెలిపారు. ఈ కానుకను ఊహించలేదని ఇది తన జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని రష్మిక ఆనందాన్ని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా రష్మిక ఈ విశేషాలను షేర్ చేయడంతో ప్రస్తుతం ఈ బంగ్లా వార్త నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.





## 29న బెల్లంకొండ పెళ్లి



టాలీవుడ్ యాక్షన్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్ బై చెప్పి ఒక ఇంటివాడు కాబోతున్నాడు. ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె కావ్య రెడ్డితో ఆయన వివాహం నిశ్చయమైంది. తాజాగా వీరిద్దరి పెళ్లికి సంబంధించి జరిగిన 'లగ్నపత్రిక' వేడుక ఫోటోలు,వీడియో లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులు తమ ప్రియతమ హీరోకు శుభాకాంక్షలు తెలుపుతుండటంతో బెల్లంకొండ వారి ఇల్లు పెళ్లి సందడితో కళకళలాడుతోంది. తాజాగా ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో అత్యంత వైభవంగా లగ్నపత్రిక రాసే కార్యక్రమం పూర్తయింది. ఈ వేడుకలో సాయి శ్రీనివాస్ చాలా హ్యాపీగా, క్యూట్ లుక్స్‌తో కనిపిస్తున్న ఫోటోలను స్వయంగా సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఇక కేవలం అత్యంత సన్నిహితులు, బంధువుల మధ్య జరిగిన ఈ వేడుకలో పెళ్లి ముహూర్తాన్ని ఏప్రిల్ 29గా ఖరారు చేశారు. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు కొత్త జంట చూడముచ్చటగా ఉందంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ వివాహ వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉ ంది. ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె కావడంతో ఈ పెళ్లిని చాలా గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.






# లక్నో థ్రిల్లింగ్ విక్టరీ

**ముకుల్ చౌదరి సూపర్ బ్యాటింగ్.. ఓటమిని గెలుపువైపు మళ్లించిన మ్యాచ్.. కోల్‌కతాకు సొంతగడ్డపై ఓటమి**

ఐపీఎల్ 2026 సీజన్‌లో మరో ఉత్కంఠభరితమైన మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఓటమి ఖాయం అనుకున్న మ్యాచ్‌లో యువ ఆటగాడు ముకుల్ చౌదరి (54 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ 3 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో చివరి బంతి వరకు పోరాడిన లక్నో, చిరస్మరణీయ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. 182 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్ ఛేదనలో తడబడింది. మార్ష్ (15), మార్క్రమ్ (22), పంత్ (10) వంటి కీలక బ్యాటర్లు త్వరగా వెనుదిరగడంతో లక్నో కష్టాల్లో పడింది. ఆయుష్ బదోని (54) హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేసినా, అతను కూడా ఔట్ కావడంతో లక్నో 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన ముకుల్ చౌదరి, మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కోల్‌కతా బౌలర్లపై ఎదురుదాడికి దిగి, కేవలం 27 బంతుల్లో 2 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 200.00 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 54 పరుగులు చేశాడు. చివరి ఓవర్లో విజయానికి 14 పరుగులు అవసరం కాగా, వైభవ్ అరోరా బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాది స్కోరును సమం చేశాడు. చివరి బంతికి సింగిల్ తీసి జట్టుకు థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే (41), అంగ్‌క్రిష్ రఘువంశీ (45) రాణించగా, చివర్లో రోవ్‌మన్ పావెల్ (39 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, ముకుల్ చౌదరి అసాధారణ పోరాటంతో కోల్‌కతాకు సొంతగడ్డపై ఓటమి తప్పలేదు.



## భారత అత్యంత వృద్ధ క్రికెటర్ కన్నుమూత

భారత క్రికెట్‌లో ఒక శకం ముగిసింది. దేశపు అత్యంత వృద్ధ టెస్ట్ క్రికెటర్, మాజీ ఆటగాడు సీడీ గోపీనాథ్ (96) గురువారం చెన్నైలో కన్నుమూశారు. భారత్ తన మొట్టమొదటి టెస్ట్ విజయాన్ని నమోదు చేసిన చరిత్రాత్మక జట్టులో జీవించి ఉన్న ఏకైక సభ్యుడు ఆయనే కావడం విశేషం. ఈ ఏడాది ప్రారంభంలో దత్తా గైక్వాడ్ మరణంతో, ఆ జట్టులోని చివరి ఆటగాడిగా గోపీనాథ్ మిగిలారు. చెన్నైలోని అడయార్‌లో ఉన్న తన కుమార్తె నివాసంలో నిద్రలోనే గోపీనాథ్ ప్రశాంతంగా తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1930 మార్చి 1న మద్రాసులో జన్మించిన ఆయన, కుడిచేతి వాటం బ్యాటర్‌గా దేశవాళీ క్రికెట్‌లో మద్రాస్ జట్టు తరఫున నిలకడగా రాణించి జాతీయ జట్టులో స్థానం సంపాదించారు. 1951-52లో ఇంగ్లండ్‌పై భారత్ చరిత్రాత్మక టెస్ట్ విజయం సాధించడంలో గోపీనాథ్ కీలక పాత్ర పోషించారు. ఆ మ్యాచ్‌లో 35 పరుగులు చేయడమే కాకుండా, వినూ మన్కడ్ బౌలింగ్‌లో కీలకమైన క్యాచ్ అందుకున్నారు. ఆ మ్యాచ్‌లో వినూ మన్కడ్ మొత్తం 12 వికెట్లు పడగొట్టి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఆటగాడిగా రిటైర్మెంట్ తర్వాత కూడా గోపీనాథ్ క్రికెట్‌కు సేవలందించారు. మద్రాస్ జట్టుకు కెప్టెన్‌గా, 1970లలో జాతీయ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా, 1979 ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టు మేనేజర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. గోపీనాథ్ మృతి పట్ల తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ సంతాపం వ్యక్తం చేసింది. ఆయన వారసత్వం క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడింది.

## భారత్‌తో సత్సంబంధాల కోసం తమీమ్ ప్రయత్నాలు

బంగ్లాదేశ్‌లో రాజకీయ మార్పులతో పాటు ఆ దేశ క్రికెట్ బోర్డులోనూ పెను మార్పులు సంభవించాయి. కొత్త ప్రధానమంత్రిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు చేపట్టాక, క్రికెట్ కార్యకలాపాలను చక్కదిద్దే బాధ్యతను మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్‌కు అప్పగించారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డులో నెలకొన్న అస్థిరతను తొలగించేందుకు 11 మంది సభ్యులతో కూడిన అడ్-హాక్ కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షుడిగా తమీమ్ ఇక్బాల్ బాధ్యతలు చేపట్టారు. రాబోయే 90 రోజుల్లోగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి బోర్డును గాడిలో పెట్టాలని కొత్త యాజమాన్యం నిర్ణయించింది. టీ20 వరల్డ్ కప్ 2026 సమయంలో భారత్‌లో పర్యటించేందుకు నిరాకరించడంతో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడమే లక్ష్యంగా తమీమ్ అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది చివర్లో ద్వైపాక్షిక సిరీస్ కోసం టీమిండియాను బంగ్లాదేశ్‌కు ఆహ్వానిస్తూ బీసీసీఐకి అధికారిక ప్రతిపాదనలు పంపారు. భారత్‌లో పర్యటించేందుకు కూడా బంగ్లా ఆసక్తి చూపుతోంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా భారత్ పర్యటనను విజయవంతం చేయడం ద్వారా రెండు దేశాల మధ్య క్రికెట్ బంధాన్ని మళ్లీ బలోపేతం చేయాలని తమీమ్ భావిస్తున్నారు.



## క్వార్టర్స్ చేరిన ఆయుష్

బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో మూడో రోజు భారత్‌కు నిరాశే ఎదురైంది. రెండో రోజు ఏకపక్ష విజయాలతో ప్రిక్వార్టర్స్ చేరిన సింగిల్స్ షట్లర్లలో యువ సంచలనం ఆయుష్ శెట్టి మినహా మిగిలినవారంతా రెండో రౌండ్‌కే ఇంటిబాట పట్టారు. హెచ్‌ఎస్ ప్రణయ్, పీవీ సింధు, ఉన్నతి హుడా నిరాశపరిచారు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్ ఆయుష్.. 21-16, 21-12తో తనకంటే మెరుగైన ర్యాంకు (20) కల్గిన చైనీస్ తైపీ షట్లర్ చియు జెన్‌ను ఓడించాడు.భుజం గాయం నుంచి కోలుకుని ఇటీవలే రీఎంట్రీ ఇచ్చిన ప్రణయ్.. 12-21, 19-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో అపజయం పాలయ్యాడు. రెండుసార్లు ఒలింపిక్ విజేత సింధు.. 18-21, 8-21తో రెండో సీడ్ వాంగ్ జియి (చైనా) జోరు ముందు నిలువలేకపోయింది. ఉన్నతి హుడా 17-21, 9-21తో మియజకి (జపాన్) చేతిలో చిత్తైంది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో జంట 13-21, 14-21తో నాలుగో సీడ్ మలేషియా జోడీ చెంగ్ టాంగ్ జీ, తొ ఈ వీ చేతిలో ఓడింది. మహిళల డబుల్స్‌లో ప్రియా, శృతి కూడా రెండో రౌండ్‌కే నిష్క్రమించారు.

## ఒకే మ్యాచ్‌లో 9 వికెట్లు

### బ్రెజిల్ అమ్మాయి వరల్డ్ రికార్డు

టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో బ్రెజిల్ మహిళల జట్టు కెప్టెన్ లారా కార్డోసో అసాధారణ బౌలింగ్ ప్రదర్శనతో ప్రపంచ రికార్డు సృష్టించింది. బీసీఏ కలహారీ మహిళల టీ20ఐ టోర్నమెంట్ 2026లో భాగంగా లెసోతోతో జరిగిన మ్యాచ్‌లో ఆమె ఈ ఘనత సాధించింది. కార్డోసో కేవలం 3 ఓవర్లు బౌలింగ్ చేసి, 4 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా 9 వికెట్లు పడగొట్టడం విశేషం. ఈ అద్భుత ప్రదర్శనతో, పురుషులు, మహిళల టీ20 క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 9




వికెట్లు తీసిన తొలి క్రీడాకారిణిగా లారా కార్డోసో నిలిచింది. ఇంతకుముందు పురుషుల టీ20ల్లో సోనమ్ యేషే (8/7), మహిళల క్రికెట్‌లో రోమాలియా (7/0) పేరిట ఉన్న రికార్డులను ఆమె అధిగమించింది. తన రెండో ఓవర్లో హ్యాట్రిక్‌తో ప్రత్యర్థి పతనాన్ని శాసించిన కార్డోసో, ఆ తర్వాత ఓవర్లలోనూ వికెట్ల వేట కొనసాగించింది. ఆమె ధాటికి లెసోతో జట్టు కేవలం 6.2 ఓవర్లలో 13 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన బ్రెజిల్ జట్టు, రాబర్టా ఏవరీ (48), మోనిక్ మచాడో (69 నాటౌట్) రాణించడంతో 202 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లెసోతోను స్వల్ప స్కోరుకే కట్టడి చేసి 189 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో బ్రెజిల్ జట్టు ఆద్యంతం అద్భుత ఫామ్‌లో కొనసాగుతోంది. గతంలో జాంబియాపై జరిగిన మ్యాచ్‌లోనూ 174 పరుగుల తేడాతో గెలుపొందింది. ఆ మ్యాచ్‌లో జాంబియాను 26 పరుగులకే ఆలౌట్ చేయడంలో మరియా రిబేరో 5 వికెట్లతో, కార్డోసో 3 వికెట్లతో కీలకపాత్ర పోషించారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణిస్తూ బ్రెజిల్ ఈ టోర్నీలో బలమైన శక్తిగా నిలుస్తోంది.

## క్వాలిఫికేషన్ రౌండ్‌కు సురభి

ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్, పిస్టల్ వరల్డ్ కప్‌లో హైదరాబాదీ షూటర్ సురభి భరద్వాజ్ రాపోలు.. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్స్ క్వాలిఫికేషన్ రౌండ్‌కు ప్రవేశించింది. గురువారం జరిగిన ఎలిమినేషన్ రిలేలో సురభి.. 582 పాయింట్లు స్కోరు చేసి మెయిన్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో చోటు దక్కించుకుంది. శుక్రవారం జరిగే క్వాలిఫికేషన్ రౌండ్‌లో టాప్-8లో నిలిచిన షూటర్లు ప్రధాన పోటీలకు ఎంపికవుతారు.

## మూడు నెలలే బతుకుతానన్నారు

భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కెరీర్‌లో క్యాన్సర్‌ను జయించాడని మనకు తెలిసిందే. 2011 వన్డే ప్రపంచకప్‌లో నెత్తురొడ్డుతూనే భారత్‌ను గెలిపించిన యూవీ.. మృత్యుంజయుడిలా ఈ మహమ్మారి నుంచి బయటపడ్డాడు. మ్యాచ్ విజేతగా టీమిండియాను ఎన్నోసార్లు ఒడ్డున పడేసిన ఈ దిగ్గజ ఆటగాడు ప్రస్తుతం యువ ఆటగాళ్లకు బ్యాటింగ్ మెలకువలు నేర్పుతూ బిజీగా ఉంటున్నాడు. అయితే.. ఒకానొక దశలో అతడు మూడు నుంచి ఆరు నెలలకు మించి బతకడని వైద్యులు తేల్చి చెప్పారట. ఈ విషయాన్ని 'ది ఓవర్‌ల్యాప్ క్రికెట్' షోలో పంచుకున్న యువరాజ్ తన క్యాన్సర్ ప్రయాణంలోని ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. స్వదేశంలో జరిగిన 2011 వన్డే ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడాడు. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై క్రీజునంటుకున్న యూవీ నొప్పిని భరిస్తూ నెత్తురు కక్కుతూనే జట్టును గెలిపించాడు. వరల్డ్‌కప్ అనంతరం భారత జట్టు విదేశీ పర్యటనలకు సిద్ధమైన వేళ తనకు క్యాన్సర్ ఉందనే విషయం అతడికి తెలిసింది. టెస్టు జట్టుకు ఎంపికైన సంతోషాన్ని తనకు లేకుండా పోయిందని ది ఓవర్‌ల్యాప్ క్రికెట్ షోలో మైఖేల్ వాన్‌తో యూవీ చెప్పాడు. 'కెరీర్ అత్యుత్తమ దశలోనే నేను ఒక్కసారిగా గుంతలో పడిపోయాను. భారత జట్టు వెస్టిండీస్, ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. అప్పుడు ఢిల్లీలో ఉన్నాను. టెస్టులకు గంగూలీ వీడ్కోలు పలకడంతో ఏడేళ్ల నా నిరీక్షణ ఫలించే రోజు వచ్చింది. దాంతో, ఆరోగ్యం గురించి ఆలోచించలేదు. చచ్చినా సరే టెస్టు జెర్సీ వేసుకోవాలనుకున్నా కానీ, చూస్తుండగానే నా ఆరోగ్యం మరింతగా క్షీణించింది అని యువరాజ్ వెల్లడించాడు. ఇక డాక్టర్ కలినప్పుడు తాను మరో మూడు - ఆరె నెలలే బతుకుతాననే విషయాన్ని చెప్పార'ని భారత దిగ్గజం ఈ సందర్భంగా తెలిపాడు. 'నా ఆరోగ్యం మరింత దెబ్బతినడంతో డాక్టర్‌ను కలిశాను. నీ ఊపిరితిత్తులకు, గుండెకు మధ్యలో క్యాన్సర్ కణతి ఉంది. ఈ పరిస్థితుల్లో క్రికెట్ ఆడితే నీకు గుండెపోటు రావచ్చు. కీమోథెరపీ చేయించుకోకుంటే నువ్వు మరో మూడు- ఆరు నెలలకు మించి బతకవు అని వైద్యుడు చెప్పాడు. అతడలా చెప్పేసరికి ఆలోచనల్లో పడ్డాను. వెంటనే అమెరికా వెళ్లి లాన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్(అమెరికా మాజీ రేసింగ్ సైక్లిస్ట్)కు వైద్యం చేసిన డాక్టర్‌ను కలిశా. అప్పుడు ఆయన నన్ను పరీక్షించి నువ్వు ఆస్పత్రి నుంచి సంతోషంగా వెళ్తావు. నీకు మళ్లీ క్యాన్సర్ అనేది రాదు అని భరోసానిచ్చారు. క్రికెట్ ఆటే నాకు తెలిసిన ప్రపంచం. క్రికెట్ ఆడకుంటే నేనెవరు? అనే ఆలోచనలు నన్ను చుట్టుముట్టేవి. అందుకని కీమోథెరపీ చేయించుకుంటున్న సమయంలో క్రికెట్ వీడియోలు చూసేవాడిని. అనిల్ కుంబ్లే, సచిన్ టెండూల్కర్‌లు వచ్చి నన్ను చూసి ధైర్యం చెప్పారు. క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్నాక.. ఇంగ్లండ్‌లో రెండు నెలలు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాను. ఆ తర్వాత తిరిగొచ్చి మైదానంలో అదరగొట్టాను' అని తాను క్యాన్సర్‌ను జయించి, మళ్లీ క్రికెటర్‌గా రాణించిన తీరును యువరాజ్ వివరించాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 10-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు
సంపాదకీయం Editorial

# భారత్ 'రక్షణ' కేతనం

ఒకప్పుడు ఆయుధాల కోసం అగ్రరాజ్యాల వైపు చూసిన భారత్, నేడు 'చాప కింద నీరులా' తన రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచం విస్తుపోయేలా బలోపేతం చేసుకుంటోంది. కేవలం కొనుగోలుదారుగా మాత్రమే కాకుండా, తయారీదారుగా ఎదిగి రక్షణ ఎగుమతుల్లో రూ. 38,424 కోట్ల రికార్డు స్థాయికి చేరడం విశేషం. ముఖ్యంగా డ్రోన్ టెక్నాలజీ, యుద్ధ నౌకల నిర్మాణంలో భారత్ అనుసరిస్తున్న వ్యూహం భవిష్యత్ యుద్ధ రంగంలో గేమ్ చేంజర్‌గా మారనుంది. ఆధునిక యుద్ధ తంత్రంలో డ్రోన్లు ఎంతటి కీలకమో రష్యా-ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాలు నిరూపించాయి. దీనిని గుర్తించిన భారత్, స్వదేశీ స్టార్టప్‌ల ద్వారా అత్యాధునిక డ్రోన్లను తన అమ్ములపొదిలో చేర్చుకుంటోంది. కేవలం 60 రోజుల్లోనే వందలాది ఆత్మాహుతి (కామికేజ్) డ్రోన్లను దేశీయ సంస్థ 'ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ' ఆర్మీకి సరఫరా చేసి రికార్డు సృష్టించింది. 1,200 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించగల సామర్థ్యం కలిగిన శేష్ నాగ్-150 డ్రోన్, పేలోడ్‌ను మోసుకెళ్లడమే కాకుండా 'స్వార్మ్ టెక్నాలజీ'తో శత్రువులను గందరగోళంలో పడేస్తుంది.నిఘా కోసం రుస్తోమ్ శ్రేణి డ్రోన్లు, శత్రు స్థావరాలను ధ్వంసం చేసేందుకు స్టీల్త్ సామర్థ్యం ఉన్న ఘాతక్ డ్రోన్లు భారత్‌ను రక్షణ అగ్రరాజ్యాల సరసన నిలబెడుతున్నాయి. హిందూ మహాసముద్రంలో చైనా ప్రాబల్యాన్ని అడ్డుకునేందుకు భారత్ తన నౌకాదళాన్ని యుద్ధప్రాతిపదికన ఆధునీకరిస్తోంది. 'ప్రాజెక్ట్ 17ఏ' కింద అత్యంత శక్తివంతమైన ఏడు యుద్ధ నౌకలను నిర్మిస్తోంది. ఏప్రిల్ 3, 2026న విశాఖపట్నంలో జలప్రవేశం చేసిన ఐఎన్ఎస్ తారాగిరి స్టీల్త్ యుద్ధ నౌక, శత్రువుల రాడార్లకు చిక్కకుండా బ్రహ్మోస్ క్షిపణులతో దాడులు చేయగలదు. ఈ నౌకల్లో 75% కంటెంట్ స్వదేశీ పరిజ్ఞానంతో తయారవ్వడం భారత్ ఆత్మనిర్భరతకు నిదర్శనం. నౌకలపైకి వచ్చే క్షిపణులను, డ్రోన్లను అడ్డుకునేందుకు 76ఎంఎం డార్ట్ స్మార్ట్ షెల్స్ వంటి సరికొత్త టెక్నాలజీని కూడా భారత్ అభివృద్ధి చేసింది. "ఈగిల్ ఇన్ ది ఆర్మ్" (ప్రతి సైనికుడి చేతిలో ఒక డ్రోన్) అనే నినాదంతో భారత సైన్యం ముందుకు సాగుతోంది. రక్షణ శాఖ సుమారు రూ.79,000 కోట్ల నుండి రూ.3.60 లక్షల కోట్ల విలువైన కొత్త కొనుగోళ్లకు పచ్చజెండా ఊపడం, దేశీయ తయారీకి పెద్దపీట వేయడం భవిష్యత్ భద్రతపై భరోసానిస్తోంది. కేవలం సరిహద్దులను రక్షించుకోవడమే కాకుండా, ప్రపంచ రక్షణ మార్కెట్‌లో ప్రధాన శక్తిగా ఎదుగుతున్న భారత్ అడుగులు.. శాంతిని కాపాడే శక్తివంతమైన కవచంలా మారుతున్నాయి.

# తెలంగాణ అవధాన నవ్య వీణ

(.. మార్చి 20న ప్రచురితమైన వ్యాసానికి కొనసాగింపు..)

**నైజాం రాష్ట్ర ఆద్యశతావధానిగా బిరుదాంకితులైన శిరశినహళ్ కృష్ణమాచార్యులు తెలంగాణ అవధానానికి వేగుచుక్కగా భాసించినవారు. అద్భుతమైన ధిషణతో అవధానాంశాలను పూరించిన విత్వదవధాని. ఒక అవధానంలో "చేకొని రామలక్ష్మణులు సీతకు తమ్ములు శంభుడన్నయున్" అనే సమస్యనిచ్చి పూరించమంటే..**



*శ్రీకరు నెట్లు ధ్యానమును జేయుట?*
*రావణహంత లెవ్వరున్ ఆ*
*కుశుడేసతీసుతుడు? హంసుని మిత్రము లేవి? దేవసు*
*శ్లోకు డెవండు? శౌరికి బలుం డెవడౌను?*
*వచింపుమా మదిన్*

జేకొని, రామలక్ష్మణులు, సీతకు, తమ్ములు, శంభు, డన్నయున్ అని పూరించారు. సమస్యాపాదాన్ని ఆరుప్రశ్నలుగా విడగొట్టి మూడుపాదాల్లో ప్రశ్నలు వేసి, క్రమాలంకారంలో పూరించడం అవధాని ప్రతిభకు తార్కాణం. సురవం వారు ప్రశంసించిన అవధానిగా పేరొందిన ఆచ్చి వేంకట నృసింహాచార్యులు ప్రతిభాసైపన్నమైన అవధాని. పాండురంగ ముద్రణాశాలను స్థాపించిన రాళ్ళబండి రాఘవశాస్త్రి పద్యాలు గోలకొండ కవుల సంచికలో ముద్రితమవడం విశేషం. గద్వాల సంస్థానంలో పోకూరి కాశీపతి అవధానం విని మరునాడు తానూ అవధానం చేస్తానని మొండిపట్టు పట్టిన దోకూరి బాలబ్రహ్మాచార్యులు అంధత్వాన్ని అవధానంతో జయించిన కవిపండితులు.ద్వ్యర్థీ త్ర్యర్థీ కావ్యాలు రచించిన గౌరిభట్ల రామకృష్ణశర్మ లబ్ధప్రతిష్ఠులైన అష్టావధాని. వేముల వాడ రాజరాజేశ్వర సుప్రభాగ కర్త అయిన మామిడిపల్లి సాంబశివ శర్మ సంస్కృతాంధ్ర ప్రతిభాయుత అవధాని. కవయిత్రి బాలసరస్వతిగా గుర్తింపు పొందిన పునుగోటి ఆనందమాంబ విదుషీమణిగా పేరు గడించిన సుప్రసిద్ధ అవధానిని. హరి కథకులుగా ఆదర్శాచార్యులుగా ప్రసిద్ధులైన చిలుకమర్రి రామానుజాచార్యులు, అభినవ విద్యారణ్యులుగా కీర్తి నొందిన శాస్త్రుల విశ్వనాథ శాస్త్రి, ఆగమశాస్త్ర పండిత ప్రవర బిరుదాంకితులైన సముద్రాల వేంకటాచార్యులు మున్నగు అవధానులెందరో సారస్వత సేవలో తరించారు. తండ్రినుండి అవధాన వారసత్వం పుణికి పుచ్చుకున్న దూపాటి సంపత్కుమార అద్భుతమైన పూరణలను అందించిన అవధాని. తెలంగాణ కవిపండిత తేజమై అలరారిన అందెవేంకటరాజం అవధాన కళను దశదిశలా వ్యాప్తి చేశారు. ఒక అవధానంలో విస్తరి, దొప్ప, పుడ్క, పచ్చడి అనే పదాలనిచ్చి, కృష్ణ రాయబార అర్థంలో పద్యం చెప్పమన్నారట!

*విస్తరించెడు రాజ్య కాంక్ష వివేకమా కురురాజ ! నీ*
*శస్త్ర బుద్ధిని జూపవేటికి? చాటె దొప్పని మాటలన్*
*గస్తి యేలొకొ పుడ్క వచ్చునె కాలు ప్రోలికిఁబోవుచో*
*దుస్తరంబిది నిన్ను భీముడు ద్రుంచి పచ్చడిగానగున్!*

అని అందె వేంకజరాటం చెప్పిన పద్యంలో ఇచ్చిన పదాలన్నీ అన్యార్థాన్ని సంతరించుకున్నాం చక్కని భారత సందర్భాన్ని కళ్ళముందుంచిందీపద్యం. సంగీతాన్ని సాహిత్యాన్ని సమ్మిళితం చేసి అవధానాల్ని అద్భుతంగా నిర్వహించిన గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మ తెలంగాణ అవధాన కీర్తి పతాక. సమస్యలు దత్తపదుల పూరణల్లో అసమాన పాండిత్యం ద్యోతకమయింది. ఒక్కోసారి వీరితో ఛందో భాషణానికి దిగడానికి పండితులైన పృచ్ఛకులు కూడా వెనుకడుగేసేవారట. ఒక ఛందో భాషణం చూద్దాం.

*మీదేయూరు? కవిత్వ తత్త్వ విషయోన్మేష ప్రభారాశి యెం*
*తే దారఢ్య స్థితి వెల్లగా గలదొ? అద్దేయౌను నా యూరు;*
*మీరే దేవున్ భజయింత్రు? సత్కవి వరా! ఈ ద్వార్వమౌ*
*మాతృదే వీ దృగ్జాలము నెల్ల వేడెద రసాబ్ధిన్ మున్గుచున్*
*తెలగాన్!*

అని పృచ్ఛకుడితో అద్భుతంగా వేగంగా ఛందోభాషణం కొనసాగించినారట. వేద వేదాంత పౌరాణిక విద్వన్మూర్తిగా పేరొందిన పార్వెళ్ళ గోపాలకృష్ణ, భాషా సాహిత్యాలకు నిలయమై భాసిల్లిన డా. ఇందారపు కిషన్ రావులు తెలంగాణ అవధాన వైభవాన్ని మార్మోగించిన విద్వన్మూర్తులు. పలుకులమ్మ రూపు నిలబెట్టిన అవధానపండితుడు అష్టకాల నరసింహరామశర్మ. నిత్యం సారస్వత సేవలో తరించిన వీరు అనేక అవధానాలు చేశారు.

*ఒక అవధానంలో క్రికెట్టు, వికెట్టు, జాకెట్టు, రాకెట్టు అనే పదాలతో శ్రీ రామకథను చెప్పమన్నప్పుడు..*

*బాధన్ జెప్పుడు జక్రి కెట్టులని తో బాటేగు దెంచెంగదా!*
*నాథా! రాక్షసు త్రోవికెట్టు జనునో? నాముక్తి కీ*
*శక్తియే*
*సాధింపన్వలె నీవు తప్పకను రాజాకెట్లు రాణించుగా*
*నీ ధర్మంబు నెఱుంగవో యశము రాకెట్లుండునో*
*నాయకా !*

అని అందంగా పూరించారు. ఆంగ్ల శబ్దాలన్నీ మనభాషలోకి మారిపోయి, చక్కని చిక్కని పద్యమైంది. వారి సంస్కృత పాండిత్యానికి దర్పణం వారు రచించిన సారస్వతీంభావయే అన్న కృతి. సంస్కృతాంధ్ర భాషా భూషణమైన త్రిగుళ్ళ రాధా కృష్ణమూర్తి, అవధాన పరిశోధనా నికేతనమై తెలగు వారితో తెలగు పద్యంతో విడదీయలేని బంధం ఏర్పరచుకున్న రాళ్ళబండి కవితా ప్రసాద్ అవధాన కేతనాన్ని వినువీధిలో రెపరెపలాడించినారు.

నడయాడే సారస్వత మూర్తులు

తెలంగాణ అవధాన సారస్వతానికి చిరునామాగా మారి, అవధాన వైభవాన్ని దశదిశలా వ్యాపింపజేస్తున్న విద్వన్మూర్తులెందరో! విమర్శకు నిలువెత్తు నిదర్శనమైన కోవెలసుప్రసన్న, సామాజిక చైతన్యమైప్రవహించిన వల్లభాపురం జనార్దన, పద్యవైభవాన్ని ఆచంద్ర తారార్కం నిలబెట్టిన ఆరుట్ల రంగాచార్య, బహుముఖీన ప్రతిభామయమూర్తి అయిన సత్తెనపల్లి నరసింహాచారి, ఆర్షజ్ఞాన నిధిగా పేరొందిన రామడుగు నరసింహాచార్యులు, జిల్లా విజ్ఞాన సర్వస్వాల నిలయమైన శాస్త్రుల రఘురామశర్మ, మెతుకసీమ పద్యవైభవమైన ప్యారకశేషాచార్యులు, గీర్వాణ కవితాలంకార తేజమైన సాంస్కృతిక దీప్తి దోర్బల ప్రభాకరశర్మ, ఆది మకుట శతకమై వెలుగొందిన పద్యశిల్పం డా. గండ్ర లక్ష్మణరావు, శంకరాభరణ సమస్యాపృచ్ఛక చక్రవర్తి కందిశంకరయ్య వంటి నడయాడే సరస్వతీ పుత్రులు ఎందరో అవధానకళకు సజీవ సాక్ష్యాలై నిలబడ్డారు. వారు అవధానాలు చేయడమే కాదు అనేక మందికి మార్గదర్శనం వహిస్తున్నారు. క్షిప్రావధాని ముద్దురాజయ్య శత అష్టావధానాలు పూర్తి చేయడం విశేషం. యాంత్రిక గణితం అనే అంశాన్ని అతి తక్కువ సమయంలో పూర్తి చేయడం వీరి ప్రత్యేకత. సంస్కృత పాండిత్య శిల్పమై అలరారిన త్రిగుళ్ళ శ్రీహరిశర్మ, సాంకేతికతతో అవధానాన్ని సమ్మిళితం చేసిన కాటేపల్లి లక్ష్మీనరసింహ మూర్తి, అధ్యాపక పద్యశిల్పమై అలరారిన శాస్త్రుల రఘుపతి, పద్య గాన ధురీణతతో అవధానాలు చేసిన తల్లోజు యాదవాచార్యులు, ఆధ్యాత్మిక భక్తి భావమైన గౌరీభట్ల శ్రీనాథశర్మ, అధ్యాపకేంద్రమై పద్యవైభవం చాటిన డా.వేదాటి రఘుపతి, భాషోపాధ్యాయ వైభవమై వెలుగొందిన డా. బెజుగామ రామమూర్తి, పారమార్థిక శిల్పమైన పద్యకవి డా. వెలుదండ సత్య నారాయణఇలా అనేకమంది అవధానులు అవధానకళా విఖ్యాతిని దిగంతాలకు వ్యాపింప జేస్తున్నారు. సంస్కృతాంధ్ర పాండిత్యం, సల్లేఖకశిల్పం గలిగిన అవధాని కీ. శే. డా. అయాచితం నటేశ్వరశర్మ అవధానం ఆద్యంతం పాండిత్య స్ఫోరకం. ఒక అవధానంలో హలీం, హరీస్, కబాబు, ఖీమా అనే పదాలనిచ్చి శాకాహార విశిష్టత గూర్చి పద్యం చెప్పమని అన్నప్పుడు..



\- అవుసుల భానుప్రకాశ్
పద్యశిల్పి, స్వర్ణకంకణ సత్కార గ్రహీత
9603204507

*అహహా! లీలగ దినుచుంటి నరటి పండు*
*హరిహరీ సుఖదాయకమైన తిండి*
*వెనుక బాబులు తినినట్టిదనుచునెంచి*
*దేవకీమాత దలచుచు తినెద వెన్న!*

అనిపూరించారు. అన్యభాషాపదాలన్నీ చక్కగా ఔచిత్యంతో ఒదిగిపోయాయి. రాగసౌందర్య పద్య గాన శిల్పమైన డా. జియ్యె రామశర్మ శతావధాని పంచానన బిరుదాంకితులు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వీరు చేసిన శతావధానం విస్తృతమొన కీర్తిని తెచ్చిపెట్టింది. తెలంగాణ అవధాన కేతనాన్ని విశ్వవ్యాప్తం చేసింది. పద్య వైభవాన్ని ఆవిష్కరించిన వీరి పద్యం ఆచంద్రతారార్కమై నిలిచింది. ఆపద్యం..

*పద్యము భారతీహృదయ పద్మము,*
*వాఙ్మయ దివ్యసద్మమున్*
*పద్యము తెల్గువారి రసవాద్యము, సంస్కృతి వైభవాల వై*
*శద్యము, హృద్య మాద్యము, స్వజాతికి నర్పితమైన స్వాదు నై*
*వేద్యము, సర్వదా విబుధవేద్యము, దండము పద్యవిద్యకున్.*

అని అద్భుతమైన పద్యం చెప్పారు. అదీ ఆలంకారికతతో విలసిల్లడం వీరి పద్య నిర్మాణ శైలికి ప్రతిబింబం. ఉత్తమ ఉపాధ్యాయ పద్యశిల్పమైన డా. మలుగ అంజయ్య శతావధాని పద్య విద్యాధౌరేయులు. చక్కని పూరణలతో ఒప్పారే వీరి అవధానం ప్రేక్షకులను రక్తి గట్టిస్తుంది.ఒక అవధానంలో 'మార్చి, జనవరి, మండే, సండే' అనే పదాలనిచ్చి రామాయణార్థంలో పద్యం చెప్పమన్నప్పుడు..

మార్చివేసె మంథర కైక
మానసమ్ము జనవరిష్ఠుండది వినుచు
జగతివీడె! మండె గుండెలయోధ్య
రామయ్య లేక ప్రభువు జాతికోసం
డెందమండజేసె!! అని పూరించారు.

అన్యదేశ్యాలన్నీ తెలగు శబ్దాలుగా మారిపోయి పద్యానికి బిగిని చేకూర్చాయి. భావశోభిత పద్యమై నిలిచింది. బహుముఖ ప్రతిభాశాలి అయిన దోరవేటి చెన్నయ్య, వ్యాకరణ శిల్పమైన డా. గణపతి అశోకశర్మ, అవధాన విద్యాశిక్షణ నికేతనమైన మరుమాముల దత్తాత్రేయ శర్మ, విశ్వవిపంచికానాదం ఆలపించే డా . ఇమ్మడోజు భద్రయ్య, ఉత్తమ పద్యకవిగా రాణించే డా. కాంచనపల్లి గోవర్ధనరాజు, అవధాన వారసత్వం నిలబెడుతున్న గౌరీభట్ల రఘురామశర్మ, సహజకవి బిరుదాంకితులైన విద్వత్కవి బండకాడి అంజయ్యగౌడు, పద్యశిల్పమై వెలుగొందే మాడుగుల నారాయణమూర్తి, ఉపాధ్యాయ పద్యవైభవమై వెలుగొందుతున్న చేపూరి శ్రీరామ్, ఉత్తమ ఉపాధ్యాయిని నిరంతర పద్య స్ఫూర్తి అవధానిని శ్రీమతి చుక్కాయపల్లి శ్రీదేవి, జంట అవధానులౌ నవయుగంలో అవధాన క్షేత్రాన్ని సాగుచేస్తున్న డా. ముత్యంపేట గౌరీశంకరశర్మ – డా. ముదిగొండ అమర నాథ శర్మ, మున్నగు అవధాన ప్రతిభామూర్తులు ఈనేల అవధాన వైభవాన్ని దశదిశల వ్యాపింప జేస్తున్నారు. అవధాన భారతి వదనంపై నవ్వులు పూయిస్తున్నారు. డా. ఎంవి పట్వర్ధన్, గౌరీభట్ల బాలముకుంద శర్మ, తిరుక్కోవళ్ళూర్ శ్రీహర్ష, తొగరి రాజేశ్వర్, ఓంప్రకాశ్, ఐతగోని వేంకటేశ్వర్లు, అవుసుల భానుప్రకాశ్, బాణావత్ నితిన్, నచ సాహిత్, తదితర అవధానులెందరో అవధాన విద్యను ఒడిసి పట్టుకొని అవధాన జయకేతనం ఎగురవేస్తున్నారు. ఈ అవధానుల ప్రేరణతో చక్కని పద్యపూరణలు చేస్తున్న కవులెందరో అవధాన సాధనకు ఉపక్రమిస్తున్నారు. శతసంఖ్యకు సామీప్యంగా ఉన్న తెలంగాణ అవధానులెందరో అవధాన భారతిని సుసంపన్నం చేస్తున్నారు. తెలంగాణ అవధాన సారస్వత రథానికి సారథులుగా తమవంతు పాత్ర పోషిస్తున్నారు.

## అవధానులెందరికో మెట్టినిల్లు తెలంగాణ

ఈనేల ఇక్కడి అవధానులనే కాదు ఎక్కడెక్కడి అవధానులకో ఆశ్రయం కల్పించిన నేల. నాడు గద్వాల సంస్థానం గడపద్రొక్కని అవధాని లేడంటే అతిశయోక్తి కాదు. అనేక మంది అవధానులను విద్వన్మూర్తులను ఆదరించి అక్కున చేర్చుకున్నది తెలంగాణ. రాజధానిలో అవధానం చేయాలని కలలు గనే వారెందరికో కలసాకారం అయింది. తద్వారా వారి వైభవం జగమంతా పాకింది. అసాధారణ ప్రతిభామూర్తి మాడభూషి వేంకటాచార్యులు, అవధానానికి మారు పేరుగా నిలిచిన తిరుపతి వేంకటకవులు, ఆశుకవితా చక్రవర్తులైన కొప్పరపు కవులు, అవధాన జైత్ర యాత్ర చేసిన గాడేపల్లి వీర రాఘవశాస్త్రి, కవిసింహ బిరుదాంకితులో అవధాన వైభవం చాటిన పోకూరి కాశీపత్యవధాని, ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులైన డా. దివాకర్ల వేంకటావధాని, అవధాన విద్యను పరిశోధించిన సీవీ సుబ్బన్న,సరస్వతీ కంఠాభరణ బిరుదాంకితులు డా. ప్రసాదరాయ కులపతి, సత్సౌజన్యమూర్తి, పాండిత్యశిల్పం డా. ఆశావాది ప్రకాశరావు, సంస్కృతాంధ్ర నిధులైన డా. బేతవోలు రామబ్రహ్మం, డా. పరిమి రామనరసింహం వంటి విద్వన్మూర్తుల అవధానాలతో తెలుగునేల పులకరించింది. వీరి అవధాన వైశారద్యానికి నీరాజనం పట్టిందీనేల! అసంఖ్యాకమైన అవధానాలు చేసిన విద్వన్మూర్తి డా. నరాల రామారెడ్డి, గాంభీర్య పద్య శిల్పమైన డా. గండ్లూరి దత్తాత్రేయశర్మ, అసాధారణ వేగంతో పద్యం చెప్పే పాండిత్యశిల్పం నడయాడే సరస్వతీమూర్తి డా. మేడసాని మోహన్ , చక్కని పద్యగాన శిల్పమైన డా. కడిమెళ్ళ వరప్రసాద్, అచ్చతెనుగు అవధాని డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, ధారణా బ్రహ్మ రాక్షసుడుగా పేరొందిన డా. గరికిపాటి నరసింహారావు, పద్య గాన శిల్పమైన డా. మాడుగుల నాగఫణిశర్మ, త్రిభాషా మహా సహస్రావధాని డా. వద్దిపర్తి పద్మాకర్, సంస్కృతాంధ్ర నిధి డా. ఆముదాలమురళి, చక్కని పద్య శిల్పమైన డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ తదితర అవధానులెందరో తెలంగాణ నేలను అవధానపద్యాలతో పునీతం చేశారు. అంతే ఆత్మీయతతో వీరందరినీ తెలంగాణ నేల ఆదరించింది. గౌరవించింది. గుండెల్లోపెట్టుకున్నది. ఈ నేల ఆత్మీయతగల జాణ. ఈనేల అవధాన హేల. ఈ నేల పద్య సారస్వతానికి పుట్టినిల్లై ఊయలలూపిన డోల. ఈనేల పై పద్యం అమృతాన్ని ప్రవహింపజేస్తే అవధానం అమరత్వాన్ని సిద్ధింపజేసింది. అవధాన కళావిస్తృతికి అనుపమానమైన వేదికైంది తెలంగాణ. అందుకే నాతెలంగాణ కోటి రతనాల వీణ అని దాశరథి నినదించాడు. నేడు "నా తెలంగాణ అవధాన నవ్య వీణ" అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అవధానానికి పుట్టినిల్లుగా అవధానులకు మెట్టినిల్లుగా భాసించిన తెలంగాణ అవధాన సౌందర్య వీణ!!

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.